News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :261 | ఖమ్మం | శనివారం, అక్టోబర్ 24, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి



- వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయాలి
- సమాజంలో తలెత్తుతున్న కొత్త సవాళ్లు, రుగ్మతలను ఎదుర్కోవడంతో పాటు దేశాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకం కావాలి
- గడిచిన దశాబ్దాల్లో కాలం మారింది
- దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి
- కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి





## సన్న వడ్లకు భలే గిరాకీ

- క్వింటాల్ ధర రూ.3500.. పొలాల వద్దే కొనుగోళ్లు!
- సన్నరకం వరి పండించిన రైతన్నకు ఈసారి మార్కెట్‌లో మంచి గిరాకీ కనిపిస్తోంది
- వడ్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులే రైతుల వద్దకు క్యూ కడుతున్నారు

## ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ



- గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు -- మంత్రి వాకిటి శ్రీహరి
- డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా పోటీలు.. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- 27 క్రీడాంశాల్లో ప్రతిభావంతుల ఎంపిక.. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి

సి కె న్యూస్ క్రీడా ప్రతినిది హైదరాబాద్: తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడాకారుల ఎంపిక, స్టేడియాల సిద్ధత, శిక్షణ

వివరాలు 2లో..

## లైసెన్స్‌కు కొత్త రూల్స్

- డ్రైవింగ్ టెస్ట్ పాస్ మార్కులు 75 శాతానికి పెంపు
- భారతీయులు, విదేశీయులకు జారీ చేసే లేదా రెన్యూవల్ డ్రైవింగ్ లైసెన్సుల కోసం వేర్వేరు రంగుల పథకాలను ప్రవేశపెట్టాలని కేంద్రం భవన
- విదేశీయులను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈ ప్రత్యేక రంగుల విధానాన్ని ప్రతిపాదించింది

## భారత్ లక్ష్యంగా చేసుకున్నది కాదు



- అమెరికా వర్క్ వీసా రూల్స్‌పై రూబియో
- అమెరికా జాతీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని రూబియో స్పష్టం

## పెరుగుతున్న వాయు కాలుష్యం



- హైదరాబాద్, సంగారెడ్డిలో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం ఎక్కువ
- తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వాయు కాలుష్యం పెరిగిపోతోంది
- వాతావరణంలో కలుస్తున్న దుమ్ము, ధూళి వల్ల పీఎం
- 10 స్థాయి జాతీయ ప్రమాణాల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి.



## భారత ఆర్మీకి స్వదేశీ 'నాగాస్త్ర-2' ఆత్మాహుతి డ్రోన్లు

- 60 నిమిషాల పాటు గాల్లో ఉండేలా డిజైన్
- రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి ఊతమిస్తూ నాగ్‌పూర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ సంస్థ 'నాగాస్త్ర-2' వ్యవస్థను అభివృద్ధి చేసింది.
- సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ తయారీ..

## ఎల్‌నినో ముప్పు.. కరువు గండం!



- వచ్చే 8--10 నెలలు అప్రమత్తంగా ఉండాలి..
- సాగునీటి లభ్యతపై ఆందోళన
- యాసంగి పంటలు వేయొద్దని రైతులకు సీఎం విజ్ఞప్తి
- విద్యుత్, నీటి పొదుపుపై ప్రజలకు పిలుపు
- కరెంట్ విషయంలో పొదుపు మంత్రం పాటించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్
తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో కరవు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే 8 నుంచి 10 నెలలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. రాబోయే నాలుగు నెలల్లో సాగునీటి లభ్యతపై తీవ్ర అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని పేర్కొంటూ, రైతులు యాసంగి పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని కోరారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితులు రావచ్చని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు ముందుగానే వివరించాలని అధికారులకు సూచించారు.

వివరాలు 2లో..



## దేశం ముందు వాస్తవాలు పెట్టండి

- మోదీకి ఖర్గే మూడు ప్రశ్నలు- చైనా పాలసీపై తీవ్ర విమర్శలు
- భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.
- చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్లు ఇచ్చేశారని ఆరోపించారు.
- అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి

## ఈనెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి



- క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష
- లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు.
- మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మాణం

# ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ

- మొదటి పేజి తరువాయి

తదితర అంశాలపై శుక్రవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం-మంత్రి వాకిటి శ్రీహరి**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 27 రకాల క్రీడాంశాల్లో 1:4, 1:2, 1:1 నిష్పత్తుల ఆధారంగా క్రీడాకారులను దశలవారీగా గుర్తించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఖేలో ఇండియా పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు. క్రీడాకారుల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఆధారంగానే అవకాశాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేవలం పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా, తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

**స్టేడియాల సిద్ధత.. క్రీడాకారులకు పోషకాహారం-మంత్రి వాకిటి శ్రీహరి**

ఖేలో ఇండియా పోటీలు నిర్వహించే క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి, వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలు, ఇతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణతోపాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రభుత్వ పరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వైద్య సహాయం, వసతి, రవాణా వంటి సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**దేశానికే ఆదర్శంగా ఖేలో ఇండియా నిర్వహణ-మంత్రి శ్రీహరి**

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్ దేశానికే దిక్సూచిగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పిస్తూ, పోటీల నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. ఈ పోటీలు తెలంగాణ క్రీడా రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతోపాటు

రాష్ట్ర యువతలో క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచేలా ఉండాలని పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ మల్లారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్, శ్రీనివాస్, ఇంజినీర్ శ్రీనివాస్ పి ఆర్ ఓ సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ముప్పు.. కరువు గండం!

-మొదటిపేజీ తరువాయి

గడ్డుకాలంపై ముందస్తు హెచ్చరిక

రాష్ట్రంలో రానున్న కాలంలో నీరు, విద్యుత్ కొరత సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం పరిస్థితులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని అన్నారు. పరిస్థితి తీవ్రతను ముందుగానే తెలియజేయడం ద్వారా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ప్రజలు ఎయిర్ కండిషనర్ల (ఏసీ) వినియోగాన్ని తగ్గించాలని, అవసరం లేని సమయంలో విద్యుత్ పరికరా లను ఆపివేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పగటిపూట అవసరం లేకుండా లైట్లు, ఫ్యాన్లు వినియోగిం చవద్దని అధికారులకు తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని ఆదేశించారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో పొదుపు చర్యలు అత్యవసరమని పేర్కొన్నారు.

**రిజర్వాయర్లలో తగ్గిన నీటి నిల్వలు**

రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఆందోళనకరంగా ఉన్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వా యర్లలో 20 శాతం కూడా నీరు లేదని, కృష్ణా జలాల లభ్యత కూడా పరిమితంగానే ఉందని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటి అవసరాలను తీర్చడంతోపాటు పశు సంపదను కాపాడుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నీటి లభ్యత పరిమితంగా ఉన్నప్పుడు సాగునీటి సరఫరా, విద్యుత్ వినియోగాన్ని సమన్వయం



చేయడం సవాలుగా మారుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. రైతులు పంటల సాగు విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం**

ఎల్‌నినో ప్రభావం అంతర్జాతీయ స్థాయిలో పలు దేశాలపై పడుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్ర వంటి అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోనూ నీటి వినియోగంపై ఆంక్షలు విధించాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ లోనూ నీటి వినియోగాన్ని నియంత్రించడంతోపాటు విద్యుత్ పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.

వానాకాలంలో అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో పంటల సాగుకు కొంత ఊరట లభించిందని, అయితే రాబోయే కాలంలో పరిస్థితులు మారే అవకాశాలను విస్మరించకూడదని అన్నారు. ఎండల తీవ్రత పెరిగితే ప్రజల సాధారణ జీవనంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కరవును ఎదుర్కోవడానికి ప్రభుత్వ చర్యలతోపాటు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని స్పష్టం చేశారు.

**రాజకీయ విమర్శలు.. ప్రభుత్వ వివరణ**

కరవు పరిస్థితులపై ప్రభుత్వం ప్రజలను ముందుగానే అప్రమత్తం చేస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడే పరిస్థితులకు సంబంధించి వాస్తవాలను ప్రజలకు వివరించకుండా వదిలేస్తే ప్రతిపక్షాల ప్రచారమే ప్రజల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై రాజకీయ దురుద్దేశంతో విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కరవు పరిస్థితులను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ నేతల సమావేశం**

అంతకుముందు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో నీరు, విద్యుత్ పరిస్థితులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు గ్రాడ్యుయేట్ స్థానాలను గెలుచుకునేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పెరుగుతున్న వాయు కాలుష్యం

వాయుకాలుష్యం ఢిల్లీలోనే కాదు మన రాష్ట్రంలోనూ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలో ఉన్న హైదరాబాద్, నల్గొండ నగరాలతో పాటు జిల్లా కేంద్రం సంగారెడ్డిలోనూ గాలి నాణ్యత ఆందోళనకరంగా ఉంది. ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యం, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు, రోడ్లపై ఉండే ధూళి, నిర్మాణ పనులు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి.

**ఈ 3 ప్రదేశాల్లోనే ఎక్కువ**

2025--26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక సగటు గణాంకాల ప్రకారం, పీఎం-10 స్థాయి జాతీయ ప్రమాణాలను మించి ఉన్నాయి. హైదరాబాద్‌లో కాలుష్య స్థాయిలు జాతీయ పరిమితి కంటే 33.3% ఎక్కువగా ఉండగా, సంగారెడ్డి, నల్గొండలలో వరుసగా 30%,18.3% అధికంగా ఉన్నాయి.

**గాలిలో పీఎం-10 స్థాయిలు ఎంత ఉండాలి?**

పీఎం-10 అనేది సూక్ష్మ కణ పదార్థాల సమూహాన్ని సూచిస్తుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిర్దేశించిన గాలి నాణ్యత ప్రమాణాల ప్రకారం, పీఎం - 10 వార్షిక సగటు గాఢత గాలిలో క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించకూడదు. అయితే 2025-26లో హైదరాబాద్‌లో 80 మైక్రోగ్రాములు, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, పీఎం-10 వార్షిక సగటు 15 మైక్రోగ్రాములుగా ఉండాలి. ఈ ప్రమాణంతో పోలిస్తే, నమోదైన స్థాయిలు హైదరాబాద్‌లో 5.3 రెట్లు, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు ఎక్కువగా ఉన్నాయి.



**వాయు కాలుష్యంతో దీర్ఘకాల సమస్యలు**

సూక్ష్మ ధూళికణాల సమూహం శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయి. వాయు కాలుష్యానికి దీర్ఘకాలం పాటు గురికావడం వల్ల శ్వాసకోశ, హృదయ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఇప్పటికే ఆస్తమా, గుండె జబ్బులు లేదా ఊపిరితిత్తుల సంబంధిత అనారోగ్య సమస్యలు ఉన్నవారిపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. అప్పటితో పోలిస్తే హైదరాబాద్‌లో కొంత మెరుగుదల కనిపించినప్పటికీ, కాలుష్య స్థాయిలు ఇప్పటికీ నిర్ణీత పరిమితుల కంటే 33.3 శాతం ఎక్కువగా ఉన్నాయి.

## సన్న వడ్లకు భలే గిరాకీ



ఓవైపు ఎల్‌నినో ప్రభావం మరోవైపు భూగర్భ జలాలు అడుగంటడంతో పంట దిగుబడులపై మెదక్ జిల్లాలో ప్రతికూల ప్రభావం పడినప్పటికీ సన్న రకం ధాన్యం పండించిన రైతులకు మాత్రం మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తోంది. గతంలో వడ్లను అమ్ముకోవాలంటే కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ఆ సీన్ పూర్తిగా మారింది. రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే వ్యాపారులే నేరుగా పొలాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేసి అక్కడికక్కడే నగదు ముట్టచెబుతున్నారు. దీంతో రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు, రోజుల తరబడి ఎదురుచూసే బాధలూ తప్పాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు**

రాష్ట్రవ్యాప్తంగా సన్న వడ్లు పండించిన రైతన్నకు ఈసారి మార్కెట్‌లో మంచి గిరాకీ కనిపిస్తోంది. ధాన్యం నాణ్యతగా ఉంటే చాలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులే రైతుల వద్దకు క్యూ కడుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన పలువురు వ్యాపారులు నేరుగా గ్రామాల్లోని పొలాల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

**క్వింటాల్‌కు రూ.3,300 నుంచి రూ.3,500**

మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో గ్రేడ్-ఏ సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.3,300 నుంచి రూ.3,500 వరకు ధర పలుకుతుందని రైతులు ఆనందంతో చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే క్వింటాల్‌కు సుమారు రూ.1000 వరకు అదనంగా లభిస్తుండటంతో అన్నదాతలు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈసారి పంట దిగుబడి తగ్గినప్పటికీ ధర కొంత ఎక్కువగా వస్తుండటంతో నష్టాల బారిన పడకుండా తప్పించుకోగలిగామని చెబుతున్నారు. గతంలో వరి కోతలు మొదలైనప్పటి నుంచి రైతులకు పరీక్ష మొదలయ్యేది. ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తరలించడం. అక్కడ కుప్పలు పోసి కాంటా కోసం రోజుల తరబడి ఆరబెట్టి ఎదురుచూడటం. అకాల వర్షాలు వస్తాయేమోనని ఆందోళన చెందడం. ధాన్యాన్ని కాపాడుకునేందుకు తంటాలు పడాల్సి వచ్చేది. చివరకు ధాన్యం అమ్మిన తర్వాత డబ్బులు ఎప్పుడు ఖాతాలో పడతాయోనని బ్యాంకుల చుట్టూ తిరగడం జరిగేది. కానీ ఈసారి పరిస్థితి కొంత భిన్నంగా మారింది. పంట కోతలు పూర్తికాకముందే వ్యాపారులే పొలాల వద్దకు చేరుకుని ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో రైతులకు ఖర్చులు కలిసొస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తప్పిందని రైతులు చెబుతున్నారు.

**బహిరంగ మార్కెట్‌లోనే అమ్మకాలు**

ఈ ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్-ఏ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,461 కనీస మద్దతు ధర నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల సన్న వడ్లకు దీనికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించింది. అయితే మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు నాణ్యతకు అనుగుణంగా క్వింటాల్‌కు రూ.3,300 నుంచి రూ.3,500 వరకు ధర చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. దీంతో ప్రభుత్వ మద్దతు ధర, బోనస్ కోసం ఎదురు చూడకుండా బహిరంగ మార్కెట్‌లో లభిస్తున్న ధరలకే రైతులు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. మొత్తానికి దిగుబడులపై ప్రకృతి ప్రభావం చూపినా, సన్న వడ్లకు పెరిగిన డిమాండ్ రైతులకు కొంత ఊరటనిస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షణకు బదులు పొలాల వద్దకే వస్తున్న వ్యాపారులు, తగ్గుతున్న అదనపు ఖర్చులు రైతుల్లో కొత్త ఉత్సాహం నింపుతోంది. పంట దిగుబడి వచ్చినప్పుడు ఈ ధరలు ఉంటే రైతులకు ఆదాయం మరింత పెరిగి తమ కుటుంబాలు ఆర్థికంగా స్థిరత్వాన్ని సాధిస్తాయని చెబుతున్నారు. అయితే ఈ డిమాండ్ ఎంతకాలం కొనసాగుతుంది? రైతులకు లభిస్తున్న ధరలు రానున్న రోజుల్లోనూ నిలకడగా ఉంటాయా? అనే అంశాలపై వేచి చూడాలి.

## ఈనెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి



హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్? ఇళ్లకు ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్ రూమ్? ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించాలని ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలన్నీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి, ఆన్‌లైన్ విధానంలో డ్రా నిర్వహించడం ద్వారా ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచవచ్చని పేర్కొన్నారు. లాటరీ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ఎప్పుడైనా చూసుకునేలా యూట్యూబ్‌లో పెట్టాలన్నారు. క్యూర్ పరిధిలో మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

**ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం భూములు గుర్తింపు**

ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం మొదటి విడతలో మిగిలిన నియోజకవర్గాలతో పాటు రెండు, విడతల కోసం యుద్ధప్రాతిపదికన స్థలాలు గుర్తించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇందిరమ్మ టవర్లు నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అన్ని నియోజకవర్గాల్లో భూములు గుర్తించాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. భూముల గుర్తింపు నుంచి నిర్మాణాలు పూర్తయ్యే వరకు ప్రతీ దశలోనూ నిర్దిష్ట కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, గృహనిర్మాణ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**తదుపరి విడతలో కొత్త దరఖాస్తుదారులు**

ఇటీవల ప్రతి అపార్ట్?మెంట్?కు సంబంధించిన భూమిలో వాటాను సైతం రిజిస్ట్రేషన్?లో పొందుపరుస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. వచ్చే ఏడాది బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారికి తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని ప్రకటించారు.

## గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతంలో విషాదం

- గ్యాస్ లీకై ఇద్దరు కార్మికుల మృతి



**గడ్డపోతారం,అక్టోబర్ 23(సీ కే న్యూస్):**సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పారిశ్రామిక ప్రాంతంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సరాకా లేబొరేటరీస్‌లో గ్యాస్ లీక్ కావడంతో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురై మృతి చెందినట్లు జిన్నారం పోలీసులు తెలిపారు.వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 22న అర్ధరాత్రి సమయంలో కంపెనీలోని ప్రొడక్షన్ బ్లాక్-2లో ఔషధాల తయారీకి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ పైప్‌లైన్ లీక్ కావడంతో క్లోరోఫామ్ వాయువు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అక్కడ పనిచేస్తున్న ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు.
వెంటనే స్పందించిన కంపెనీ సిబ్బంది బాధితులను అంబులెన్స్‌లో సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.
మృతులను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పంగ సుదర్శన్ రావు (43), కీలపర్తి బాలాజీ (29)గా గుర్తించారు. వీరిద్దరూ హైదరాబాద్‌లోని చింతల్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. సుదర్శన్ రావు స్వస్థలం శ్రీకాకుళం కాగా, బాలాజీ స్వస్థలం విజయనగరం జిల్లాగా సమాచారం.
సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్యాస్ లీకేజీకి గల కారణాలు, ప్రమాదం జరిగిన తీరుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి అధికారిక విచారణలో వెల్లడయ్యే వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

- ఇల్లు మంజూరు చేయించానంటూ రూ.50 వేల డిమాండ్.. బాధితుడి నుంచి రూ.11 వేలు వసూలు
- ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- బాధితులు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలి -- టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు




**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్** నిందితుడి వివరాలు:
మానే శంకర్ (25), ం/శీ సంతోష్, నివాసం: ఇంటి నం. 3-2-168/1, భాగ్యనగర్ (తాటిగూడ), ఆదిలాబాద్.ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు తెలిపారు.భాగ్యనగర్‌కు చెందిన ఉస్కెంవార్ అరవింద్ భార్య రూప పేరు మీద గత సంవత్సరం ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఈ క్రమంలో తాటిగూడకు చెందిన మానే శంకర్ అనే వ్యక్తి తానే ఇల్లు మంజూరు చేయించానని, తనకు రూ.50,000 ఇవ్వాలని, లేకపోతే ఇంటి మంజూరును రద్దు చేయిస్తానని బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో భయపడి 12.07.2025న ఫోన్‌పే ద్వారా రూ.10,000, అనంతరం అక్టోబర్ 2025లో మరో రూ.1,000 చెల్లించినట్లు తెలిపాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులు క్రైమ్ నంబర్ 722/2026, బీఎన్ఎస్ సెక్షన్లు 318(4), 308(2), 316(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుడితో పాటు సంబంధిత వ్యక్తులను విచారించి వివరాలు సేకరిస్తున్నారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, మంజూరైన పథకాలను రద్దు చేయిస్తామని బెదిరించినా ప్రజలు భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం మధ్యవర్తులకు డబ్బులు చెల్లించవద్దని, ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు.

### "20 ఏళ్లుగా ప్రజా సమస్యలపై పోరాటం.. 1వ వార్డులో మార్పే లక్ష్యం"

- బ్యాట్ గుర్తుతో స్వతంత్ర అభ్యర్థిగా భాగం లక్ష్మి పోటీ

**తగరపువలస, అక్టోబర్ 23 సికె.న్యూస్. ప్రతినిధి.**జీవీఎంసీ 1వ వార్డు స్వతంత్ర కార్పొరేటర్ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న భాగం లక్ష్మి శుక్రవారం తగరపువలస ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తన పోరాట ప్రస్థానాన్ని, వార్డు అభివృద్ధికి చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు.గత 20 సంవత్సరాలుగా భీమిలి నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నానని భాగం లక్ష్మి తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో ప్రజాసేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన భర్త, దళిత నాయకుడు భాగం గోపాలరావు పోలీసు ఉద్యోగాన్ని వదిలి గత 35 సంవత్సరాలుగా న్యాయవాదిగా పేద ప్రజలకు సేవలందిస్తున్నారని, వందలాది మందికి ఇళ్ల స్థలాలు పొందేందుకు సహకరించామని వెల్లడించారు.

**వార్డు అభివృద్ధికి పలు హామీలు**

తగరపువలస ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు, అంబేద్కర్ కూడలిలో బస్‌షెల్టర్ నిర్మాణం, గోస్తనీ నదిపై చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం కృషి చేస్తానని భాగం లక్ష్మి తెలిపారు. కొండపాలెంలో అంబేద్కర్ కళ్యాణ మండపం, అంబేద్కర్ పార్కు ఏర్పాటు, సిమెంట్ రహదారుల నిర్మాణం, తాగునీటి కొళాయిల ఏర్పాటు వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, మహిళల కోసం మరుగుదొడ్ల సదుపాయం వంటి అంశాలపైనా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
బ్యాట్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తితనకు ఎన్నికల గుర్తుగా బ్యాట్ కేటాయించారని, 1వ వార్డు ప్రజలు తన పోరాట ప్రస్థానాన్ని, అభివృద్ధి హామీలను పరిశీలించి బ్యాట్ గుర్తుపై ఓటు వేయాలని భాగం లక్ష్మి కోరారు.ఈ సమావేశంలో దళిత నాయకుడు భాగం గోపాలరావు, మామిడి శివ తదితరులు పాల్గొన్నారు.

# చింతలపల్లిలో దళితుల స్మశాన వాటికకు దారేది

- 60 ఏళ్లుగా వినియోగంలో ఉన్న దారికి అడ్డంకులు..
- దళితుల అంత్యక్రియలకూ అవస్థలా





**సీకే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి:**చింతలపల్లి గ్రామంలో దళితుల ఆవేదన మనిషి జీవించినంతకాలం గౌరవంగా బతకాలి.. మరణించిన తర్వాత అంతిమ సంస్కారాలు సైతం గౌరవప్రదంగా జరగాలి. ఎమ్మార్పీఎస్ తాలూకా నాయకులు అగ్రస్వామి మరియు నాగర్ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చలకూర లక్ష్మణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతలపల్లి గ్రామంలో దళితుల స్మశాన వాటికకు వెళ్లే దారిపై నెలకొన్న వివాదం ఇప్పుడు తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. సుమారు 50 నుంచి 55 ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న స్మశాన వాటికకు వెళ్లే మార్గాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారని గ్రామస్తులు, దళిత సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామంలో ఎవరైనా దళితులు మృతి చెందితే మృతదేహాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్లేందుకు దారి లేదంటూ అడ్డంకులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు దశాబ్దాలుగా ఉన్న దారి.. ఇప్పుడు అడ్డంకులు, అయితే స్మశాన వాటికకు వెళ్లే దారిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి వ్యవసాయ భూమిగా వినియోగించుకుంటున్నారాని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో గతంలో సులభంగా వెళ్లగలిగిన మార్గం ఇప్పుడు లేకుండా పోయిందని, అంత్యక్రియల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.
ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతూ అంతిమ సంస్కారాలకు సిద్ధమవుతారు. అలాంటి విషాద సమయంలో మృతదేహాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్లే మార్గం లేదంటూ అడ్డంకులు ఎదురవడం బాధిత కుటుంబాలకు మరింత మానసిక వేదన కలిగిస్తోందని గ్రామస్తులు మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు అగ్రస్వామి, బచ్చలకూర లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మశాన వాటికకు వెళ్లే దారి విషయంలో నెలకొన్న సమస్య కారణంగా దళిత కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, ఈ పరిస్థితికి అధికారులు తక్షణ పరిష్కారం చూపాలని కోరుతున్నారు.
స్మశాన వాటికకు వెళ్లే దారి ప్రభుత్వ భూమిలో ఉందా, ఆ మార్గాన్ని ఎవరైనా ఆక్రమించారా, గతంలో ప్రజలు వినియోగించుకున్న దారిని ప్రస్తుతం ఎందుకు అడ్డుకుంటున్నారు, అనే అంశాలపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ రికార్డులను పరిశీలించి, సర్వే నిర్వహించి, వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమ ఆక్రమణలు జరిగినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, దళితులు తమ స్మశాన వాటికకు గతంలో మాదిరిగా వెళ్లేందుకు అవసరమైన మార్గాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. అంత్యక్రియల సమయంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవప్రదమైన జీవనానికి హామీ ఇస్తుంది. కులం ఆధారంగా ఎవరినీ వివక్షకు గురిచేయకూడదు. స్మశాన వాటికకు వెళ్లే మార్గం విషయంలో దళితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యను రాజకీయ నాయకులు కూడా సీరియస్‌గా తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకుల విజ్ఞప్తి
చింతలపల్లిలో దళితుల స్మశాన వాటికకు వెళ్లే మార్గంపై నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామ ప్రజలు, దళిత సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ తాలూకా నాయకులు అగ్రస్వామి, నాగర్ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చలకూర లక్ష్మణ్ ఎమ్మార్పీస్ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు, సంబంధిత అధికారులను, రాజకీయ నాయకులను కోరారు. దళితులు గతంలో మాదిరిగానే ఎలాంటి ఆటంకాలు లేకుండా స్మశాన వాటికకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్మశాన వాటికకు దారి కల్పించడం దయతో చేసే పని కాదు.. ప్రజల గౌరవానికి సంబంధించిన బాధ్యత. ఆరు దశాబ్దాలుగా వినియోగంలో ఉన్న మార్గంపై వచ్చిన ఆరోపణలను అధికారులు తక్షణమే పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి, బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## యూనిక్ కంపెనీ బాధితుల నుంచి జిల్లా ఎస్పీకి ప్రత్యేక సన్మానం



- ప్రధాన నిందితుడి అరెస్ట్‌తో హర్షం వ్యక్తం చేసిన 150 మంది బాధితులు
- వివిధ జిల్లాల నుంచి ఆదిలాబాద్‌కు చేరుకుని ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్‌కు అభినందనలు
- దేశవ్యాప్తంగా పది వేల మంది బాధితులకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం

**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్ :**యూనిక్ మర్చంటైల్ ఇండియా లిమిటెడ్, యూనిక్ ఎస్ఎంసీఎస్ సంస్థల పేరుతో పెట్టుబడులు, చిట్ ఫండ్స్ ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి దేశవ్యాప్తంగా 10000 మంది ప్రజల నుంచి భారీగా డబ్బులు సేకరించిన కేసులో ప్రధాన నిందితుడు గుజరాత్ అహ్మదాబాద్ కు చెందిన రాజ్ కుమార్ రాయ్ ఏ రాజ్ కుమార్ కైలాష్ రాయ్ (69) ను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో వివిధ జిల్లాలకు చెందిన సుమారు 150 మంది బాధితులు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్‌ను ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు తెలిపారు.
నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, మెదక్, వరంగల్, కామారెడ్డి తదితర జిల్లాల నుంచి బాధితులు గురువారం రాత్రి ఆదిలాబాద్‌కు చేరుకుని ఎస్పీ కార్యాలయంలో ఆయనకు శాలువా కప్పి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.
దేశవ్యాప్తంగా వేలాది మంది బాధితులు యూనిక్ సంస్థల పెట్టుబడి పథకాల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 10 వేల మంది ప్రజలు డబ్బులు పెట్టుబడిగా పెట్టి నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ బాధితులు ఉన్నట్లు సమాచారం. పెట్టుబడుల గడువు పూర్తయినప్పటికీ డబ్బులు తిరిగి అందకపోవడంతో అనేకమంది బాధితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన నిందితుడి అరెస్ట్‌తో తమకు న్యాయం జరిగే అవకాశం ఉందని బాధితులు ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజల నుంచి సేకరించిన డబ్బులు, సంస్థల ఆర్థిక లావాదేవీలు, నిందితులకు సంబంధించిన ఆస్తుల వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఇతర వ్యక్తుల పాత్ర, బాధితుల సంఖ్య, పెట్టుబడి మొత్తాలపై మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. భారీగా పెట్టబడులను సేకరించి వివిధ రాష్ట్రాలలో ఫైవ్ స్టార్ హోటల్స్ ను, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నందు 400 ప్లాట్లను 200 ఎకరాల స్థలాలను కొనుగోలు చేయడం జరిగిందని వాటిని కోర్టు ద్వారా జప్తు చేసేలా నివేదికలను పంపడం జరుగుతుందని తెలిపారు.పెట్టుబడి మోసం కేసులో బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమ ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లలో నమోదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రధాన నిందితుడి అరెస్ట్ నేపథ్యంలో బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జిల్లా ఎస్పీని సన్మానించడం ఈ కేసుపై బాధితుల్లో ఉన్న ఆశలను ప్రతిబింబించింది. బాధితుల ఫిర్యాదులు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు కొనసాగనున్నాయి.

## కొమురం భీం 125వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన డాక్టర్ నరేష్ జాదవ్ గారు



**సికె.న్యూస్. ప్రతినిధి. ఆదిలాబాద్:** జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన గోండు వీరుడు కొమురం భీం గారు – ఎతీ నరేష్ జాదవ్ గారు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొమురం భీం విగ్రహం వద్ద ఆయన 125వ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ గారు మాట్లాడుతూ, కొమురం భీం గారు ఆదివాసీల హక్కులు, స్వేచ్ఛ కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గొప్ప ఆదివాసి విప్లవ యోధుడని పేర్కొన్నారు. ఆదివాసీలకు జల్ , జంగల్ , జమీన్ పై హక్కులు ఉండాలని చాటిచెప్పిన ఆయన "జల్, జంగల్, జమీన్" నినాదం నేటికీ ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిస్తోందని అన్నారు.

కొమురం భీం గారు తన జీవితాన్ని ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అంకితం చేశారని, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆయన త్యాగం, ధైర్యం, పోరాట పటిమ భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధి, వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు వారి హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ నరేష్ జాదవ్ గారు పిలుపునిచ్చారు. కొమురం భీం ఆశయాలను స్మరించుకోవడమే కాకుండా, ఆయన చూపిన బాటలో సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల ఆత్మగౌరవం కోసం ముందుకు సాగాలని అన్నారు.మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ గారు, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి గారు, ఓబీసీ సెల్ అధ్యక్షులు అంబకంటి అశోక్ గారు,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజర్ పాషా గారు, జాదవ్ రాదేశ్యం గారు,జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషనల్ ఇంచార్జి బెజ్జంకి అనిల్ గారు, జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ఇన్చార్జ్ గౌలి సంజీవ్ కుమార్ గారు, ఆదిలాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ దూబే గారు, కాంగ్రెస్ ఎస్సి విభాగం అధ్యక్షులు పరమేశ్వర్ గారు, రాష్ట్ర ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్ గారు,ఎస్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు సేద్మకి ఆనందరావు గారు, జిల్లా కాంగ్రెస్ ఫ్రాంటాల్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ దేరా కృష్ణ రెడ్డి గారు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు

# రక్తదాన శిబిరానికి భారీ స్పందన - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.



- అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు భారీ ఎత్తున మెగా రక్తదాన శిబిరం నిర్వహణ.
- జిల్లా పోలీసు చరిత్రలో మొట్టమొదటిసారిగా కనివిని ఎరుగని రీతిలో విశేష స్పందన.
- జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛందంగా రక్తదానం చేసిన 853 మంది ప్రజలు, యువత, పోలీసులు.
- స్వయంగా రక్తదానం చేసి సిబ్బందికి ఆదర్శంగా నిలిచిన జిల్లా ఎస్పీ
- ఒకప్పటి పోలీసు ప్రాణ త్యాగాల ఫలితమే ప్రస్తుత ప్రశాంత జిల్లా కు కారణం.
- రక్తదానాన్ని చేసి ఆదర్శంగా నిలిచిన మహిళలు.
- అత్యవసరమైన సమయంలో ప్రాణాలను కాపాడేది రక్తం, రక్తదానం మహోన్నతమైనది.
- రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ.

**సికె.న్యూస్. ప్రతినిధి.ఆదిలాబాద్** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ రక్తదాన శిబిరానికి భారీ ఎత్తున స్పందన లభించిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించి దాదాపు 853 యూనిట్ల రక్తాన్ని ప్రజలు స్వచ్ఛందంగా విచ్చేసి రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. శుక్రవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు ఏర్పాటు చేయబడిన ఈ మెగా రక్తదాన శిబిరానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని, రిబ్బన్ కట్ చేసి భారీ ఎత్తున ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు భారీ ఎత్తున పాల్గొని అమరవీరుల జ్ఞాపకార్థం వారు చేసిన సేవలను స్మరిస్తూ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ రక్తదాన శిబిరాలలో దాదాపు జిల్లా వ్యాప్తంగా 853 యూనిట్ల రక్తాన్ని పోలీసులు, ప్రజలు, ఔత్సాహికుల రక్తాన్ని రిమ్స్ బ్లడ్ బ్యాంకుకు అందజేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ స్వయంగా రక్తదానాన్ని చేసి సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవడం జరిగింది. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్పీ స్వయంగా ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా అమరవీరుల సమస్మరణ వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, ఒకప్పటి పోలీసులు చేసిన త్యాగాలను జిల్లా ప్రజలకు సవివరంగా వివరించి పోలీసులు చేసే విధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఒకప్పటి అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితమే ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా ప్రశాంత వాతావరణ కి కారణమని గుర్తు చేశారు. ప్రజలు వారిని స్మరిస్తూ ఉండాలని, ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. వృత్తిరీత్యా పోలీసులు ప్రజల కోసం విధి నిర్వహణలు చేస్తుంటారని, వారిని ప్రజలు గౌరవించాలని, రాత్రనకా, పగలనకా, పండుగలు, కుటుంబ సభ్యులను విడిచి, ప్రజా ధన ప్రాణ మాన రక్షణలో 24 గంటలు పోలీసు యంత్రాంగం విధి నిర్వహణలో ఉంటారని తెలిపారు. జిల్లా అభివృద్ధి పథంలో వెళ్లడానికి సంఘవిద్రోహశక్తులు ఆటంకాలుగా మారుతారని, మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడానికి సంఘవిద్రవశక్తులతో పోరాడుతూ జిల్లా పోలీసు వ్యవస్థ అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. రక్తదానం శిబిరం పెద్ద ఎత్తున ప్రజలు పోలీసు సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. ఉత్సాహంగా పాల్గొని మహిళలు సైతం రక్తదానాన్ని చేసి పురుషులకు సమానంగా ఆదర్శంగా నిలిచారు. రక్తం అనేది జీవితాలను కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అక్టోబర్ 21 పోలీసు అమరవీరుల దినోత్సవ సందర్భంగా వారి త్యాగాలను గుర్తు చేస్తూ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో అదనపు ఎస్పీలు పి మౌనిక ఐపీఎస్,బి సురేందర్ రావు, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, డాక్టర్లు, రిమ్స్ సిబ్బంది, పట్టణ సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిమ్స్ సిబ్బంది, ఎన్జీవో నాయకులు, ప్రజలు, యువజన సంఘాలు, ప్రైవేటు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఇంటింటా సర్వే,పిడి మాణిక్యం,

- ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, ఎమ్మార్వో బాల్ లక్ష్మి,





**అక్టోబర్ 23 సీ కే న్యూస్ చేగుంట:** చేగుంట మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు, ఇంక ప్రారంభించకపోవడంతో, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్ధిదారులతో ఇంటింటి సర్వే నిర్వహించిన, హౌసింగ్ పీడీ మాణిక్యం, వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించన లబ్ధిదారులు త్వరగా ప్రారంభించాలని తెలిపారు, లేదంటే మీరు ప్రారంభించకపోతే మీ వేరే లబ్ధిదారులకు అందిస్తాము వీలైనంత త్వరగా నిర్మాణం చేపట్టాలని వారు కోరారు,ఈ కార్యక్రమంలో చేగుంట తహసిల్దార్ బాల్ లక్ష్మి, ఆర్ఐ జై భరత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సమీనా సుల్తానా, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు,

# పేదల భూములు లాక్కుంటే సహించేది లేదు

- సిద్ధాపూర్‌లో 233 ఎకరాల భూమిపై డంపింగ్ యార్డు ప్రతిపాదనపై అభ్యంతరం
- పరిశ్రమలు, డంపింగ్ యార్డుల పేరుతో భూసేకరణ వాటిని అడ్డుకుంటాం
- టీడీపీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



**సి కే న్యూస్ షాద్ నగర్ :అక్టోబర్ 23:** నిరుపేదలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ భూములను పరిశ్రమలు, డంపింగ్ యార్డుల పేరుతో సేకరించేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని టీడీపీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు హెచ్చరించారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పేదల భూముల పరిరక్షణ, భూసేకరణ, పర్యావరణ సమస్యలపై మాట్లాడారు.భూసంస్కరణలు, భూదాన ఉద్యమాల ద్వారా గతంలో నిరుపేదలకు పంపిణీ చేసిన భూములను ప్రస్తుతం పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టుల పేరుతో కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బక్కని ఆరోపించారు. పేదల జీవనోపాధికి ఆధారమైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు.

### నాగులపల్లి వాగు ప్రవాహంపై ఆందోళన

నాగులపల్లి వాగు సహజ ప్రవాహాన్ని మళ్లించే అంశంలో అధికారుల వ్యవహారశైలి ఆందోళన కలిగిస్తోందని బక్కని నర్సింహులు అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిరభ్యంతర పత్రాలు జారీ చేస్తున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.సిద్ధాపూర్ పరిధిలోని సర్వే నంబర్లు 361, 252, 278లలో సుమారు 233 ఎకరాల భూమిలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే చేవెళ్ల నియోజకవర్గంలోని తిమ్మారెడ్డిగూడెం సర్వే నంబర్ 483లో 153 ఎకరాలు, లింగారెడ్డిగూడ సర్వే నంబర్ 287లో 119 ఎకరాలతో పాటు కొండన్నగూడ ప్రాంతంలోని భూములను పరిశ్రమల కోసం సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.కులమతాలకు అతీతంగా పేదల వద్ద ఉన్న కొద్దిపాటి భూములను కూడా సేకరిస్తే వారి కుటుంబాలు జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

### తరతరాలకు భూమే జీవనాధారం

కంపెనీలు కల్పించే ఉద్యోగాలు పరిమిత కాలానికే ఉంటాయని, వ్యవసాయ భూములు మాత్రం తరతరాలుగా కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తాయని బక్కని నర్సింహులు అన్నారు. భూములు కోల్పోయిన రైతులు తమ సొంత ప్రాంతాల్లోనే కూలీలుగా, కాపలాదారులుగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పచ్చని పొలాలను కోల్పోయేలా చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.

### భూముల పరిరక్షణకు సీఎం జోక్యం చేసుకోవాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై తక్షణమే స్పందించి పేదల భూములను కాపాడాలని బక్కని నర్సింహులు విజ్ఞప్తి చేశారు. లక్ష్మీదేవునిపల్లి ప్రాజెక్టు ద్వారా గోదావరి, కృష్ణా జలాలను తీసుకొచ్చి సాగునీరు అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం, మరోవైపు రైతుల భూములను సేకరించేందుకు ప్రయత్నిస్తే ఆ నీటిని ఎవరు వినియోగించుకుంటారని ప్రశ్నించారు.పేదల భూముల పరిరక్షణతో పాటు పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. భూసేకరణకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి, నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# నాగులవంచలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని సైడ్ డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు, బస్టాండ్ లో.. మరియు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను సిబ్బంది తొలగించారు.గ్రామంలో పరిశుభ్రతను కాపాడటంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ఈ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో.. సర్పంచ్ నారగాని రాంబాయి, ఉపసర్పంచ్ అంబటి శరత్ కుమార్, కార్యదర్శి, వార్డ్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాతృమూర్తికి ఘన నివాళులు .



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**(23-10-2026) భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఖమ్మం జిల్లా కార్యదర్శి శ్రీ అనగాని రామారావు మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళు లర్పించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ నెల్లూరి కోటేశ్వరరావు , ఓబీసీ మోర్చా ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీ రేఖ సత్యనారాయణ యాదవ్ బీజేపీ సీనియర్ నాయకులు శ్రీ మద్దినేని వెంకటేశ్వర్లు , చింతకాని బీజేపీ మండల అధ్యక్షులు శ్రీ కొండ గోపి , ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ గందసరి వీరభద్ర గౌడ్ ఉపాధ్యక్షులు శ్రీ పల్ల వెంకన్న , ఐటీ సెల్ కన్వీనర్ శ్రీ బొర్రా భాను ప్రకాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆ మాతృమూర్తి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# నాయిని జలాల్పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## క్వింటాలుకు ఏ-గ్రేడ్‌కు రూ.2,461.. సాధారణ రకానికి రూ.2,441



**సికె న్యూస్ మెదక్ జిల్లా ప్రతినిధి కొల్చారం, అక్టోబర్ 23 :**మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయిని జలాల్పూర్ గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు. గ్రామ దేవి సింగ్ అధ్యక్షతన గురువారం కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా అధికారులు, కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ధాన్యంలో తేమ శాతం 17కు మించకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాయిని వెంకట నరసింహులు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు గంపల లక్ష్మయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్న రాయన్న, లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి మౌనిక, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జులు గొల్ల పాండరి, చందర్ నాయక్, వార్డు సభ్యులు గంగ స్వామి, మధులత, కుమారస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, నాయకులు నాయిని విట్టల్, దాసు, నర్సింలు, ఏగొండతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూ వివాదం...... వ్యక్తి మృతి




-తొమ్మిది మందిపై కేసు నమోదు చేసిన ఎస్సై జి నరేష్

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**చింతకాని : ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామంలో వ్యవసాయ భూమి వివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనలో కన్నెబోయిన కొండలు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు చింతకాని ఎస్ఐ జి. నరేష్ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కన్నెబోయిన నాగేంద్రమ్మ, భర్త కన్నెబోయిన కొండలుతో కలిసి వ్యవసాయ భూమి విషయంలో కొంతకాలంగా వివాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో అక్టోబర్ 21న తన కుమారుడు కన్నెబోయిన ఉపేందర్‌పై, అనంతరం తన భర్త కన్నెబోయిన కొండలుపై కొందరు దాడికి ప్రయత్నించి, చంపుతామని బెదిరింపులకు పాల్పడినట్లు నాగేంద్రమ్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఘటనతో మనస్తాపానికి గురైన కన్నెబోయిన కొండలు గడ్డిమందు తాగగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్టోబర్ 22న మధ్యాహ్నం 3.19 గంటలకు మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ ఘటనపై అక్టోబర్ 23న ఉదయం 10 గంటల సమయంలో నాగేంద్రమ్మ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా, ఆమె ఫిర్యాదు ఆధారంగా కన్నెబోయిన అంజయ్య, కన్నెబోయిన నాగేంద్ర, కన్నెబోయిన నాగేశ్వరరావు, కన్నెబోయిన రామారావు, కన్నెబోయిన సాయి, కన్నెబోయిన శ్రీను, శీలం చైతన్య, కన్నెబోయిన సీతారామయ్య, చౌడం సత్యం అనే తొమ్మిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్ఐ జి. నరేష్ వివరించారు.ఈ ఘటనకు సంబంధించి తదుపరి పోలీసు చర్యలు కొనసాగనున్నాయి.

# పేదరికాన్ని అధిగమించి పీజీ మెడికల్‌లో రాణించిన డాక్టర్ రూత్ జాన్ పాల్

**సి కె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** నగరంలోని రమణగుట్ట మురికివాడకు చెందిన కొయ్యల రూత్ జాన్ పాల్ పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు . నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆమె ఎన్నో కష్టనష్టాలు , అవమానాలను ఎదుర్కొంటూ చదువే లక్ష్యంగా ముందుకు సాగారు . తల్లి దండ్రుల దగ్గర ఉంటూ హైస్కూల్ , ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అనంతరం వైద్య విద్యపై ఉన్న ఆసక్తితో ఖమ్మంకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ కేవీ కృష్ణారావు తదితరుల సహకారంతో హైదరాబాద్‌లో ఎంసెట్ కోచింగ్ తీసుకున్నారు . అనంతరం ఎంబీబీఎస్ పూర్తి చేసి , హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ విభాగంలో పీజీ వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి తన ప్రతిభను చాటుకున్నారు . పేదరికం తన లక్ష్యానికి అడ్డుకాదని నిరూపించిన డాక్టర్ రూత్ జాన్ పాల్‌ను పలువురు అభినందించారు . పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు , నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచి సమాజ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు .



## వసతి గృహంలో ఆహార నిల్వలు, ౧ పరిశుభ్రతపై మండల ప్రత్యేక అధికారి తనిఖీ



**సీకే న్యూస్ ప్రతినిధి వనపర్తి జిల్లా** వనపర్తి జిల్లాలోని ౹+ూాెొ=ా జీజ దీశీఎం వసతి గృహాన్ని మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సందర్శించి తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా వసతి గృహంలోని స్టోర్ రూమ్, స్టాక్ రిజిస్టర్, రోజువారీ సరుకుల జారీ రిజిస్టర్, వంటగది, భోజనశాల, పాత్రలు కడిగే ప్రదేశం, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నిల్వలు, వాటి వినియోగం, రికార్డుల నిర్వహణ, పరిశుభ్రతను తనిఖీ చేశారు.విద్యార్థులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని, వంటగది, భోజనశాల, వసతి గృహ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆహార పదార్థాలను సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయాలని తెలిపారు.అలాగే స్టాక్ రిజిస్టర్, డైలీ ఇష్యూ రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

## పట్టభద్రుల ఓటుతో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

- దసరాకు ఇస్తామన్న డీఏల విడుదల ఏమైంది?
- నవంబర్ 6లోపు పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు
- బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి



**మధిర అక్టోబర్ 23(సికె న్యూస్)ప్రతినిధి:**మధిరఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఆ వైఫల్యాలను పట్టభద్రుల ఓటు ద్వారా ఎండగట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు.
స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరాకు విడుదల చేస్తామన్న డీఏల సంగతేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.
యూత్ డిక్లరేషన్, మెగా డీఎస్సీ, ఉద్యోగ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ పెండింగ్‌లో ఉండగా, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాల చెల్లింపుల్లోనూ సమస్యలు ఎదురవుతున్నాయని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు.గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినా ప్రజలకు దూరం కాలేదని, ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతోందని తెలిపారు. పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ..
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కువినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఫారమ్–18 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, గ్రామాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తల సహకారం కూడా పొందవచ్చని తెలిపారు. నవంబర్ 6లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిభకు దక్కిన గౌరవం..జడ్జిగా ఎంపికైన అగిరు లక్ష్మీ ప్రసాద్

- ఘనంగా సత్కరించి,శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్నగర్ నియోజకవర్గం సి కె న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 23** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్,అగిరు లక్ష్మీ ప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి షాద్ నగర్ పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి అగిరు లక్ష్మీ ప్రసాద్ గారిని శాలువాతో సత్కరించి,ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా
ఎమ్మెల్సీ మాట్లాడుతూ..న్యాయ వాదిగా విధులు నిర్వహిస్తూ కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం లక్ష్మీ ప్రసాద్ ప్రతిభకు,నిరంతర కృషికి దక్కిన గౌరవమని కొనియాడారు. న్యాయవ్యవస్థలో ఎంతో బాధ్యతాయుతమైన ఈ పదవిని చేపట్టబోతున్న ఆయన,భవిష్యత్తులో ప్రజలకు నిష్పక్షపాతంగా న్యాయం అందిస్తూ,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.
ఈ సత్కార కార్యక్రమంలో షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీరంగూర జగన్మోహన్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, నందకిషోర్,షాద్ నగర్ పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా,మాజీ సర్పంచ్ అజయ్ నాయక్,నాయకులు దండు రాము,హర్ష వర్ధన్ రెడ్డి,అన్వారీ రాజు,శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో అధికారులు/సిబ్బంది విఫలమైతే సహించేది లేదు



- మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత
- పారిశుద్ధ్య లోపాలపై అధికారులకు తక్షణ చర్యలకు ఆదేశం
- ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ప్రతి వార్డులో క్షేత్రస్థాయి పరిశీలన

**మధిర అక్టోబర్ 23(సికె న్యూస్)ప్రతినిధి.**మధిరప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మధిర మున్సిపాలిటీలో అధికారులతో కలిసి ప్రతి వార్డులోనూ పర్యటిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పేర్కొన్నారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ పాల్,వివిధ శాఖల అధికారులతో కలిసి మున్సిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత ఈరోజు16వ వార్డులో పర్యటించారు.వార్డులో నెలకొన్న ప్రతీ సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి,అధికారులకు అక్కడికక్కడే తగు సూచనలు చేశారు.వార్డు పర్యటనలో భాగంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక,రోడ్ల పక్కన అస్తవ్యస్తంగా పెరిగిన పిచ్చిచెట్లు,చెత్తాచెదారం కుప్పలను చైర్‌పర్సన్ స్వయంగా పరిశీలించారు. పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు,పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.పారిశుద్ధ్య నిర్వహణలో వైఫల్యం కనిపిస్తుండటంపై శానిటేషన్ సిబ్బంది,జవాన్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను, పిచ్చిచెట్లను వెంటనే తొలగించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య పనులను మరింత బాధ్యతాయుతంగా,క్రమం తప్పకుండా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క ఆశయాలకు అనుగుణంగా మధిరను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ప్రతీ వార్డులోనూ ఈ ఆకస్మిక పర్యటనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని భరోసా కల్పించారు.పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో వార్డు ప్రజలు, స్థానికులు సైతం భాగస్వాములు కావాలని,అధికారులకు సహకరించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోన ధని కుమార్, 16వ వార్డు కౌన్సిలర్ వంకాయలపాటి నాగేశ్వరరావు, నాయకులు గుర్రాల శ్రీనివాస రెడ్డి, వాసిరెడ్డి ఉపేంద్ర, బోయపాటి వెంకటేశ్వర్లు, మైలవరపు లక్ష్మి,మున్సిపల్ అధికారులు,సిబ్బంది,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలలోపే పీఆర్సీ ప్రకటించాలి

**పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి.. సమస్యలు పరిష్కరించిన వారికే మా మద్దతు**

**రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి డిమాండ్**

**సి కే న్యూస్ షాద్ నగర్ :అక్టోబర్ 23:**ఎమ్మెల్సీ ఎన్నికలలోపే పెన్షనర్లకు పీఆర్సీ ప్రకటించడంతో పాటు, వారికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల ఓట్లు కావాలనుకునే వారు ముందుగా వారి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు.శుక్రవారం షాద్‌నగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ పాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు సరాపు జగదీశ్వర్ అధ్యక్షతన, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ నిర్వహణలో సమావేశం జరిగింది. జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
వందేమాతరంతో సమావేశం ప్రారంభమైంది. ఇటీవల మృతిచెందిన వారికి సభ్యులు సంతాపం ప్రకటించారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి పి. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెన్షనర్ల సమస్యల పరిష్కారమే ప్రధాన ప్రాధాన్యంగా ఉండాలని అన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించిన వారికే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికలలోపే పీఆర్సీ ప్రకటించి, పెన్షనర్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెన్షనర్ల ఐక్యత, ఓటు హక్కు శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు



కలిగిన ప్రతి పెన్షనర్ తమ ఓటును నమోదు చేసుకోవాలని, అవసరమైతే ఆయా యూనిట్ల ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహించాలని సూచించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ పాషా మాట్లాడుతూ, ఎన్ఏహెచ్ఎస్ కార్డులకు సంబంధించి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని, ప్రతి పెన్షనర్‌కు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు నరసింహారావు, జిల్లా కోశాధికారి తేనేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, దుగ్గ శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు. షాద్‌నగర్ యూనిట్ అధ్యక్షుడు వెల్దండ రామారావు, ప్రధాన కార్యదర్శి నందిగామ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో షాద్‌నగర్ కోశాధికారి సుధాకర్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఎం. జనార్దన్, వైస్ చైర్మన్ బి. కృష్ణయ్య, సంయుక్త కార్యదర్శి మందార నరసింహులు, బి. రమేష్, ఈ. పాండు, అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.
చివరగా షాద్‌నగర్ యూనిట్ ప్రధాన కార్యదర్శి నందిగామ సురేష్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

## చేతిపంపుల వద్ద నీటి నిల్వ నివారణకు మ్యాజిక్ సోక్‌పిట్లు



**సీకే న్యూస్ ఖమ్మం జిల్లా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు అక్టోబర్ 23 2026:** ఏన్కూరు మండలం రాయమాదారం గ్రామపంచాయతీ పరిధిలో చేతిపంపుల వద్ద నీరు నిల్వ ఉండకుండా, భూమిలోకి ఇంకిపోయేలా మ్యాజిక్ సోక్‌పిట్ల నిర్మాణం చేపట్టారు. ఈ పనులను శుక్రవారం సర్పంచ్ సోనీ బాలాజీ, ఏపీఓ శ్రీదేవి, ఈసీ రాజశేఖర్, టీఏ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు పరిశీలించారు.చేతిపంపుల నుంచి వచ్చే నీరు నిల్వ ఉండటం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ఈ సమస్యలను నివారించడంలో మ్యాజిక్ సోక్‌పిట్లు కీలకంగా పనిచేస్తాయి. వీటి ద్వారా నీరు భూమిలోకి ఇంకిపోయి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండటానికి దోహదపడుతుంది. అలాగే భూగర్భ జలాల పునఃభరణకు కూడా ఉపయోగపడతాయి.
గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, నీటి వృథాను తగ్గించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా ఇలాంటి పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలికట్ట అంబాభవాని మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

- భక్తిశ్రద్ధలతో అభిషేకం.. అలంకరణ, కుంకుమార్చన, మంగళహారతి
- దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చంద్రయ్య ఆధ్వర్యంలో

**సి కే న్యూస్ షాద్ నగర్ :అక్టోబర్ 23:**ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ అంబాభవాని మాత దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే అభిషేక కార్యక్రమంలో భాగంగా దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చంద్రయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సాక్షి రిపోర్టర్ శ్రీశైలం--విజయలక్ష్మి దంపతులు, సున్నాల యాదగిరి--మధులత దంపతులు శ్రీ అంబాభవాని మాతకు అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి, కుంకుమార్చనతో పాటు మంగళహారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు ముత్యాల రాములు, రవి, కె. మహేష్, ఎస్. మహేష్, వార్డు సభ్యుడు గడ్డమీది శ్రీను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ పాడి పశువుల పంపిణీలో కాంగ్రెస్ పక్షపాతం

పక్షపాతంపై .. టీఆర్ఎస్ పార్టీ నాయకుల వినతి పత్రంలి




**మధిర అక్టోబర్ 23(సికె న్యూస్)ప్రతినిధి.**మధిరఇందిరా మహిళా డైరీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పేద ప్రజల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.2,100 చొప్పున నగదు వసూలు చేసి, పాడి గేదెలు పంపిణీ చేసే సమయంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ టీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇందిరా మహిళా డైరీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కల్పన కి వినతి పత్రం సమర్పించారు
ప్రతి గ్రామంలో సుమారు 100మంది, 200 మంది పేద ప్రజల వద్ద పార్టీ భేదం లేకుండా డబ్బులు కట్టించుకున్నారని, గేదెలు పంపిణీ చేసే సమయంలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇస్తామంటూ నిబంధనలు విధిస్తున్నారని టీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఇతర పార్టీలకు చెందిన పేద ప్రజలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసేటప్పుడు పార్టీ భేదాలు చూడకుండా, పాడి గేదెల పంపిణీ సమయంలో రాజకీయ పక్షపాతం చూపడం సరికాదని వారు పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ పార్టీ భేదం లేకుండా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
ఇదే విధంగా ఒకే పార్టీకి పరిమితమై లబ్ధిదారుల జాబితాలు రూపొందిస్తే, భవిష్యత్తులో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## సిరిపురం--మిట్టగూడెం డబుల్ రోడ్డు శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించిన పారుపల్లి విజయకుమార్



**మధిర అక్టోబర్ 23(సికె న్యూస్)ప్రతినిధి.**మధిర: సిరిపురం--మిట్టగూడెం గ్రామాల మధ్య డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించేందుకు ఏర్పాటు చేయనున్న శంకుస్థాపన శిలాఫలకం స్థలాన్ని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్ పరిశీలించారు.
తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు సీసీ రోడ్లు, తారు రోడ్లు మంజూరు చేస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.
ఇందులో భాగంగా సిరిపురం--మిట్టగూడెం గ్రామాల మధ్య డబుల్ రోడ్డు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలో చేపట్టనున్న శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దుంప వెంకటేశ్వర రెడ్డిలి తో కలిసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## తెలంగాణ ఉద్యమకారుల హామీల అమలుపై కీలక సమావేశం

- ఈ నెల 25న షాద్‌నగర్‌లో మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల భేటీ



**సి కే న్యూస్ షాద్ నగర్ :అక్టోబర్ 23:** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం మరియు తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల సమావేశాన్ని ఈ నెల 25వ తేదీ ఆదివారం నిర్వహించనున్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

షాద్‌నగర్‌లోని పెన్షనర్ భవన్‌లో ఆదివారం ఉదయం 9:30 గంటలకు సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, టీజీ శ్రీనివాస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుడు నందిగామ సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై చర్చించి, తదుపరి కార్యాచరణపై నిర్ణయాలు తీసుకునే దిశగా సమావేశం జరగనుంది.

## న్యాయమూర్తిగా ఎంపిక.. అగిరు లక్ష్మీ ప్రసాద్‌కు ఘన సత్కారం!

- జూనియర్ సివిల్ జడ్జిగా ఎదిగిన లక్ష్మీ ప్రసాద్‌కు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అభినందనలు



**సి కే న్యూస్ షాద్ నగర్ :అక్టోబర్ 23:** న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూ పట్టుదలతో చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన అగిరు లక్ష్మీ ప్రసాద్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఆయన సాధించిన విజయంపై ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, షాద్‌నగర్ పట్టణంలోని లక్ష్మీ ప్రసాద్ నివాసానికి వెళ్లి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. అగిరు లక్ష్మీ ప్రసాద్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం ఆయన ప్రతిభ, కృషి, పట్టుదలకు నిదర్శనమని పేర్కొన్నారు. న్యాయవాదిగా పనిచేస్తూనే లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రజలకు నిష్పక్షపాతంగా న్యాయం అందిస్తూ, న్యాయవ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగూర జగన్మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, నందకిషోర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా, మాజీ సర్పంచ్ అజయ్ నాయక్, నాయకులు దండు రాము, హర్షవర్ధన్ రెడ్డి, అన్వారీ రాజు, శంకర్ నాయక్ తదితరులు పాల్గొని లక్ష్మీ ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

## పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్.ఆర్ శంకరన్

- గురుకుల విద్యా వ్యవస్థకు పునాది వేసిన దార్శనికుడు..
- ఉచిత విద్య, వసతి, సమాన అవకాశాల కల్పనలో ఎస్.ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయం
- స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు



**సి కే న్యూస్ ఖమ్మం.ఖమ్మం, అక్టోబర్ 22 :** పేద విద్యార్థుల విద్యాప్రదాత ఎస్.ఆర్ శంకరన్ అని, ఉచిత విద్య, వసతి, సమాన అవకాశాల కల్పనలో ఆయన సేవలు చిరస్మరణీయమని స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు అన్నారు.

ఖమ్మం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద గురువారం ఎస్.ఆర్ శంకరన్ 92వ జయంతి, స్వేరోస్ డే లను పురస్కరించుకొని స్వేరోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్.ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ తో కలసి స్వేరోస్ జిల్లా అధ్యక్షులు కోండ్రు రామచంద్రు స్వేరోస్ జెండాను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన సీనియర్ స్వేరోస్ నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు.. కులం, ఆర్థిక స్థితిగతులు, సామాజిక వివక్ష పిల్లల భవిష్యత్తుకు అడ్డంకులు కావద్దు.. పేద కుటుంబాల్లో పుట్టిన పిల్లలు కూడా ఉన్నత విద్యను అభ్యసించి గౌరవప్రదమైన జీవితాన్ని సాధించాలనే ఆశయాలతో తన జీవితాన్ని సామాజిక సేవకు అంకితం చేసిన గొప్ప పరిపాలనా దార్శనికుడు డాక్టర్ ఎస్.ఆర్ శంకరన్ అని కొనియాడారు. ప్రభుత్వ పదవిని అధికార ప్రదర్శనకు కాకుండా అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగించిన ఆయనను ప్రజలు ప్రేమతో 'పేదల ఐఏఎస్ అధికారి'గా గుర్తుచేసుకుంటున్నారన్నారు. డాక్టర్ ఎస్.ఆర్ శంకరన్ 1934 అక్టోబర్ 22న జన్మించారని అన్నారు. ఆయన 92వ జయంతి సందర్భంగా విద్య, సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం చేసిన ఎస్.ఆర్ శంకరన్ సేవలను స్మరించుకోవడం సమాజానికి ఎంతో అవసరం అన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదివే స్థోమత లేక నాణ్యమైన విద్యకు దూరమవుతున్న పరిస్థితులను మార్చేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1984లో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల అభివృద్ధికి శంకరన్ కృషి చేశారన్నారు.

పేదల కన్నీళ్లు తుడవడమే నిజమైన ప్రజాసేవగా భావించిన ఎస్.ఆర్. శంకరన్ జీవితం... విద్యను హక్కుగా చూడాలని, సంక్షేమాన్ని సామాజిక బాధ్యతగా అమలు చేయాలని నేటి సమాజానికి చాటి చెబుతోందన్నారు. పేద విద్యార్థుల ఉన్నతి చదువుల కోసం నిరంతరం శ్రమించిన ఎస్.ఆర్ శంకరన్ జీవితాన్ని భవిష్యత్తు తరాలకు తెలియజేసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు పోలేపొంగు ఆంజనేయులు, మోదుగు నాగేశ్వరావు, కలకోట సంపత్, పిడమర్తి వెంకటేశ్వర్లు, శీలం ప్రసాద్, మందుల వెంకన్న, బండ్ల నాగేశ్వరరావు, డాక్టర్ పిసి వీరస్వామి, వంగూరి దశరద్, మేకల భాస్కర్, మందుల రమేష్, అప్పారావు, గౌతమ్, చిట్టీబాబు, మహేష్, గద్దల నాగరాజు, గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రకు ఆర్థిక సాయం అందజేసిన నెల్లి శ్రీవార్ధన్ రెడ్డి

- భక్తిశ్రద్ధలతో మహాపాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాములు
- హిందూ ధర్మరక్షణ కోసం పాటుపడాలి
- దీక్షలో అలవర్చుకున్న నియమనిష్ఠలను జీవితాంతం కొనసాగించాలి: నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 23:** షాద్‌నగర్: అయ్యప్ప స్వాముల మహాపాదయాత్ర భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమైంది. సురేష్ గురుస్వామి, రమేష్ గురుస్వామి, శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ మహాపాదయాత్రకు షాద్‌నగర్‌లోని శివమారుతి ఆలయంలో గిరీష్ నాయర్ గురుస్వామి, లక్ష్మయ్య గురుస్వామి ఇరుముడి కట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప స్వాములు పాదయాత్రగా బయలుదేరారు.

ఈ సందర్భంగా పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, అయ్యప్ప మాలాధారణ అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక దీక్ష అని, నియమనిష్ఠలు, క్రమశిక్షణ, భక్తిభావంతో కూడుకున్నదని పేర్కొన్నారు. దీక్షా సమయంలో అలవర్చుకున్న మంచి అలవాట్లను జీవితాంతం కొనసాగించాలని సూచించారు.

అయ్యప్ప దీక్ష వ్యక్తిగత జీవితంలో ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడంతో పాటు కుటుంబంలో సుఖశాంతులకు దోహదపడుతుందని అన్నారు. అయ్యప్ప స్వాములు దీక్ష ద్వారా అలవర్చుకున్న క్రమశిక్షణ, సేవాభావం, ఐకమత్యం వంటి సద్గుణాలను సమాజ శ్రేయస్సుకు, హిందూ ధర్మ పరిరక్షణకు వినియోగించాలని పిలుపునిచ్చారు.

మహాపాదయాత్రకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

మహాపాదయాత్ర నిర్వహణకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డికి అయ్యప్ప స్వాముల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని సురేష్ గురుస్వామి అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిరంతరం నిలబడే వ్యక్తి నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి అని కొనియాడారు. ఈ మహాపాదయాత్ర విజయవంతం కావడానికి పలువురు సహకారం అందించారని, సహకరించిన ప్రతి ఒక్కరికీ అయ్యప్ప స్వామి కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు.

గిరీష్ నాయర్ స్వామి ఇరుముడితో ప్రారంభమైన ఈ మహాపాదయాత్రలో అయ్యప్ప స్వాములు భజనలు, భక్తిగీతాలు, నృత్యాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. ప్రధాన రహదారిపై భక్తిశ్రద్ధలతో కొనసాగిన ఈ పాదయాత్ర స్థానికులను, భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమానికి సహకారం అందించిన ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, అందె బాబయ్య, అందె మోహన్, ఉప్పల శివకుమార్, రాయకల్ శ్రీనివాస్ తదితరులకు గురుస్వాములు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వెంకటేష్ గుప్తా, మల్చం మురళి, ప్యాట అశోక్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని మహాపాదయాత్రను విజయవంతం చేశారు.

## ఆధునిక పోలీసింగ్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం

- కొత్తూరు సి ఐ బి.నాగార్జున రెడ్డి,
- కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిజికల్ ఓపెన్ హౌస్ కార్యక్రమం,
- 120 మంది విద్యార్థులు 10 మంది ఉపాధ్యాయులు సిబ్బందికి పోలీసుల విధులు సైబర్ నేరాల నివారణపై అవగాహన,



**షాద్ నగర్ నియోజకవర్గ కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి,అక్టోబర్ 23:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరులో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిజికల్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తూరులోని మాంటిస్సోరి పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులు 10 మంది ఉపాధ్యాయులు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ పనితీరు ఆధునిక పోలీసింగ్ విధానాలు సైబర్ నేరాల నివారణ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు పోలీస్ స్టేషన్‌లో ప్రతిరోజూ నిర్వహించే విధులు ఫిర్యాదుల స్వీకరణ కేసుల నమోదు నేరాల దర్యాప్తు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులకు వివరించారు ప్రజల ప్రాణాలు ఆస్తులను రక్షించడం నేరాలను అరికట్టడం పోలీసులకు ప్రజలకు మధ్య స్నేహపూర్వక సంబంధాలను పెంపొందించడం వంటి అంశాలను తెలియజేశారు నేరాల నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని సమాజంలో శాంతిభద్రతలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు

సైబర్ ఆర్థిక మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని వివరించారు సకాలంలో ఫిర్యాదు చేయడం వల్ల సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం భవిష్యత్తుపై కలిగే దుష్ప్రభావాలను వివరించి విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు మొబైల్ ఫోన్లు ఇంటర్నెట్ సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరుపై ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు ఆధునిక పోలీసింగ్ విధానాలు మహిళల భద్రత సైబర్ నేరాల నివారణ మాదకద్రవ్యాల నియంత్రణపై అవసరమైన సమాచారాన్ని అందించారు ఈ కార్యక్రమంలో ఎస్సై సత్యశీల రెడ్డి,పోలీస్ సిబ్బంది,విద్యా విద్యార్థులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టుపంచ మరియు జన్మదిన వేడుకలకు హాజరైన



మండల మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణ చిన్నారెడ్డి

**సీకే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి :** చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో పశువుల రాజు అంకిత ల ఆహ్వానం మేరకు వారి పెద్ద కుమారుడు యశ్వంత్ పుట్టుపంచ కార్యక్రమం మరియు చిన్న కుమారుడు సుశాంత్ మొదటి జన్మదిన వేడుకలకు వారి ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథి హాజరై చిన్నారులను అక్షింతలు వేసి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని, ఎన్నో ఉన్నతమైన చదువులు చదివి మంచి భవిష్యత్తు మంచి ఉద్యోగం తో జీవించాలని ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చిన్నంబవి మండల మాజీ జడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ దేగ శేఖర్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ తగరం కురుమయ్య, వార్డు నెంబర్లు బిజినముల జగదీష్, ఎల్లల పెద్ద మదిలేటి, ఆంజనేయులు, బడికల బాబు యాదవ్, వినోద్, దేగ రాజు యాదవ్, జంగా పెద్ద బిచుపల్లి యాదవ్, తదితరులు హాజరై పశువుల రాజు ఇద్దరు కుమారులను అక్షింతలు వేసి ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

**పోలీసు అమరవీరుల త్యాగాలు, పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన**



**సీకే న్యూస్ /అక్టోబర్ 23/వేములపల్లి** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీస్ అమరవీరుల త్యాగాలు, ప్రజల రక్షణలో పోలీసులు నిర్వహించే విధుల గురించి ఎస్ఐ వి సురేష్ రెడ్డి వివరించారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, స్టేషన్ రైటర్ గది, ఎస్‌హెచ్ఓ గది, సాపిలాన్ పరికరం, సీసీ కెమెరాల పనితీరుతో పాటు అల్లర్ల నియంత్రణకు ఉపయోగించే రక్షణ పరికరాలను విద్యార్థులకు పరిచయం చేశారు. పోలీస్ శాఖ విధులు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను వివరించి, పోలీసుల సేవలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వివిధ విభాగాల పనితీరును తెలుసుకున్నారు. పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు.

## బడికి డుమ్మా కొడితే కుదరదు.. హాజరుపై కలెక్టర్ ఫోకస్!

**పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి చదువులపై ఆరా**



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** గద్వాల: దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచడంపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ దృష్టి సారించారు. శుక్రవారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి చదువుల పరిస్థితిని తెలుసుకున్నారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని, యూనిఫాంతో రావాలని విద్యార్థులకు సూచించారు. సెలవులకు ముందు ఇచ్చిన అసైన్‌మెంట్లను పూర్తి చేసి ఉపాధ్యాయులకు అందించాలని, చదువులో వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు బడికి రాకపోతే వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి హాజరు ప్రాధాన్యతను వివరించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. దాతల సహకారంతో నిర్మించిన స్టేజీ షెడ్‌ను చూశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్ల ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, తహసీల్దార్ హరికృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పొట్ట వెంకటేశ్వర్లు ప్రోత్సాహంతో జాతీయస్థాయి చెస్ పోటీలకు వరుణ్ ఆదిత్య ఎంపిక.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాయామ ఉపాధ్యాయులు పొట్ట వెంకటేశ్వర్లు అందిస్తున్న ప్రోత్సాహం, సరైన మార్గదర్శకత్వంతో మహాత్మా జ్యోతిబా పూలే బోనకల్ గురుకుల కళాశాల విద్యార్థి వరుణ్ ఆదిత్య ఎస్‌జీఎఫ్ అండర్--19 జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికై సత్తా చాటాడు. ఈ నెల 16న రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఉత్కంఠభరిత రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో బైపీసీ సెకండియర్ చదువుతున్న వరుణ్ ఆదిత్య తన ప్రతిభతో ప్రత్యర్థులను కట్టడి చేసి జాతీయస్థాయికి అర్హత సాధించాడు.

ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు పొట్ట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వరుణ్ ఆదిత్య జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపిక కావడం మన ప్రాంతానికే ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి జాతీయస్థాయిలోనూ అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచి ఛాంపియన్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యార్థి సాధించిన ఈ ఘన విజయంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్‌సీఓ సీహెచ్. రాంబాబు, డీసీఓ, కళాశాల ప్రిన్సిపాల్ సుష్మ, వ్యాయామ ఉపాధ్యాయులు పి. వెంకట్రావుతో పాటు అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

## సంపాదకీయం

# బలపడుతున్న విద్యార్థి ఉద్యమం

ఫ్రాన్స్ విద్యార్థి ఉద్యమం తగ్గుముఖం పట్టకపోగా, బలపడుతోంది, సమాజంలోని ఇతర వర్గాల ప్రత్యక్ష, పరోక్ష మద్దతుతో విస్తరిస్తోంది. స్కూళ్ళ స్థితిగతులను మెరుగుపరచాలంటూ మొదలైన నిరసనలకు తోడుగా పెరుగుతున్న ఇంధన ధరలు, క్షీణిస్తున్న ప్రజాసేవలు, ఖరీదవుతున్న ఇళ్ళు ఇత్యాది పలు సమస్యలు ఈ నిరసనలకు ఆజ్యంపోస్తున్నాయి. పారిస్ సహా అనేకనగరాల్లో విధ్వంసకాండ, లూటీలు సాగుతూ, వారసత్వ సంపదగా ఫ్రాన్స్ సగర్వంగా చెప్పుకొనే పలు అద్భుతమైన భవనాలు సైతం తగలబడిపోవడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. కార్మికసంఘాలు, రైతులు, సామాన్యప్రజలు కూడా వచ్చిచేరడంతో, కేవలం నెలరోజుల్లో ఈ ఆందోళన స్వరూపమే మారిపోయింది. అత్యంత కర్కశంగా ఈ నిరసనలను అణచివేయబోతున్నానంటూ ఫ్రాన్స్ అధ్యక్షుడు చేస్తున్న హెచ్చరికలతో మరింత హింసాయుతమైన పరిణామాలు చూడవలసి రావచ్చు.

ఫ్రాన్స్‌లో విధ్వంసానికి వలసదారులే కారణమంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు యూరప్‌లోని చాలా దేశాల నాయకులకు సమధికోత్సాహాన్నిచ్చాయి. 'ఫ్రాన్స్ తగలబడుతోంది.. పూర్తిభిన్నమైన మరో ప్రపంచం నుంచి, గుండెలనిండా ద్వేషాన్ని నింపుకున్న వారి వలసలు, ఒకప్పుడు గొప్పగా వెలిగిన ఈ దేశాన్ని ముక్కలు చేశాయి. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా, సరిహద్దులు మూసివేయండి, మీ దేశాన్ని కాపాడుకోండి' అని ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మధ్యంతర ఎన్నికల్లో ఉభయసభల్లోనూ ఉన్న ఆ కాస్త మెజారిటీ కూడా రిపబ్లికన్ పార్టీ కోల్పోనుందన్న సంకేతాల నేపథ్యంలో, ఫ్రాన్స్ దారుణపరిస్థితులను చూపి అమెరికా జనాన్ని రెచ్చగొట్టడం ట్రంప్‌కు అవసరం. అమెరికా ఘనమైన వారసత్వాన్ని కాపాడి, దానిని గ్రేట్ ఎగైన్ చేయడానికే తాను వలసలను అడ్డుకుంటున్నాననీ, లేనిపక్షంలో మనమూ ఫ్రాన్స్‌లాగా కూలిపోతామని ఆయన సూచిస్తున్నారు. వర్ధమాన దేశాల కోసం ఐరోపా సరిహద్దులను తెరవడానికి పాశ్చాత్య ఉదారవాదులు కారణమనీ, మధ్యంతర ఎన్నికలలో కాంగ్రెస్‌ను డెమోక్రాట్లు కనుక కైవసం చేసుకుంటే, ఫ్రాన్స్‌కు పట్టిన దుర్గతే తమకూ పడుతుందని అమెరికన్ ఓటర్లు గుర్తించాలని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సలహా ఇచ్చారు.

ఫ్రాన్స్ ఎంతో ఉదారంగా వలసలను అనుమతించడమే ఈ మహాఘోరానికి కారణమన్న రీతిలో యూరప్‌లోని ట్రంప్ తరహా నాయకులంతా వ్యాఖ్యలు చేస్తున్నారు. వలసలు ఒక్కటే ఫ్రాన్స్ తగలబడటానికి కారణమా? అన్న ప్రశ్నను అటుంచితే, ఫ్రాన్స్‌తో పాటు ఎన్నికలు జరగబోతున్న స్పెయిన్, ఇటలీ, పోలాండ్, గ్రీస్‌లలో వలసవ్యతిరేక వాదనలతో మితవాదులు రాజకీయంగా లబ్ధిపొందేందుకు తెగ ప్రయత్నిస్తున్నారు. యూరప్ అంతటా ఆయాదేశాల్లో అశాంతికి అనేక కారణాలు ఉన్నప్పటికీ, ప్రజాసమస్యలన్నీ వెనక్కుపోయి, వలసలు, మతం చుట్టూ విమర్శలు ప్రధానంగా సాగుతున్నాయి. కమ్యూనిస్టులూ, సోషలిస్టులూ ఈ హింసకు కారణమనీ, దీనివెనుక ఒక అంతర్జాతీయ నెట్‌వర్క్ ఉన్నదంటూ మరికొందరు కుట్రసిద్ధాంతాలు తెరమీదకు తెస్తున్నారు. భారతదేశంలో సీజేపీ ఉద్యమాలకూ, ఫ్రాన్స్ విద్యార్థి నిరసనలకూ మధ్య ఆశయాల్లో ఆదర్శాల్లో గల పోలికలను పక్కనబెట్టి ఇదంతా ఐదుఖండాల్లో, యాభైఐదుకుపైగా సంస్థల సమన్వయంతో సాగుతున్న అంతర్జాతీయ కుట్ర అని ఒక అమెరికన్ చానెల్ వాదిస్తోంది. ఇరాన్‌తో ఎడతెగని యుద్ధం చేస్తూ ఇంధనం, ఎరువుల కొరతకు కారణమై ప్రపంచాన్ని ఆర్థికసంక్షోభంలోకి నెట్టినవారే ఈ తరహా ఆందోళనల వెనుక విచ్ఛిన్నకరశక్తులున్నాయని ప్రచారం చేయడం విచిత్రం.

ఫ్రాన్స్‌లో మరో ఆర్నెల్లలో అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నందున ఈ అల్లర్లు కచ్చితంగా ఫలితాలపై ప్రభావం చూపుతాయి. పలుసర్వేల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న పచ్చిమితవాద నేషనల్ ర్యాలీ నాయకురాలు మెరినే లీపెన్‌కు ఇవి మరింత లబ్ధిచేకూర్చవచ్చు.

భారతదేశంలో వివిధరాష్ట్రాల్లో అత్యంత దుర్భరమైన స్థితిలో ఉన్న స్కూళ్ళ చిత్రాలను సీజేపీ నాయకులు కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన సంగతి తెలిసిందే. ఫ్రాన్స్‌లోనూ దాదాపు ఇటువంటి పరిస్థితులే ఉన్నాయి. సగానికిపైగా స్కూళ్ళు అరవైయేళ్ళకు పైబడినవే. టీచర్ల కొరత, కారుతున్న పైకప్పులు, కిటకిటలాడుతున్న తరగతి గదులతో ఫ్రాన్స్‌లో సైతం బడులు కడుదయనీయస్థితిలో ఉన్నాయన్నది వాస్తవం. నిరసనకారుల డిమాండ్లలో అత్యధికం సరైనవేనని అంగీకరిస్తూనే, పరిష్కారాలు చూపడం కాక, ఉద్యమాన్ని కఠినంగా అణచివేస్తానని మేక్రాన్ ప్రతిజ్ఞలు చేయడం విచిత్రం.

# రాప్తాడు జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం..

### - సహకరించిన నాయకులు, కార్యకర్తలకు గుండ్లమడుగు జయలక్ష్మి కృతజ్ఞతలు



రాప్తాడు జెడ్పీటీసీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ గుండ్లమడుగు జయలక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి తరపున రాప్తాడు జెడ్పీటీసీ అభ్యర్థిగా తనను ఎంపిక చేయడంలో సహకరించిన ఎమ్మెల్యే పరిటాల సునీతకు, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సీనియర్ టీడీపీ నాయకుడు గుండ్లమడుగు శ్రీనివాసులు సతీమణి అయిన జయలక్ష్మికి రాప్తాడు జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం లభించడంతో ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ టీడీపీ నాయకుడిగా గుండ్లమడుగు శ్రీనివాసులు పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. తనపై నమ్మకం ఉంచి జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన నాయకులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని జయలక్ష్మి పేర్కొన్నారు. అలాగే రాప్తాడు ప్రాంతంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తన అభ్యర్థిత్వానికి మద్దతుగా నిలిచి సహకరించినందుకు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక పాదాభివందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తనను అభ్యర్థిగా ఎంపిక చేయడంలో సహకరించిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని గౌరవిస్తూ, వారి సహకారాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటానని తెలిపారు. తన అభ్యర్థిత్వానికి సహకరించిన వారందరికీ ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని గుండ్లమడుగు జయలక్ష్మి స్పష్టం చేశారు.

# పద్మశ్రీ నుండి హిల్లరీ రోధం క్లింటన్ పురస్కారం వరకూ.. రీమా నానావతి

రీమా నానావతి 42 ఏళ్ల సేవా జీవితంలో అధిగమించిన మైలురాళ్లు ఎన్నో. 'పద్మశ్రీ' నుంచి తాజాగా 'హిల్లరీ రోధమ్ క్లింటన్ పురస్కారం' వరకూ పలు గౌరవాలను అందుకున్న రీమా... "నాకు ధైర్యం, బలం, స్ఫూర్తి భారతీయ గ్రామీణ మహిళలే" అంటున్నారు.

అవి 'సేవ' (సెల్ఫ్ ఎంప్లాయ్డ్ ఉమెన్ అసోసియేషన్) గ్రామీణ విభాగంలో రీమా నానావతి కార్యకర్తగా చేరిన తొలి రోజులు. గుజరాత్‌లో కరువు బారిన పడిన గ్రామాల్లో 'సేవ' తరఫున ఆమె సహాయక కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటి దృశ్యాలు ఇప్పటికీ కళ్ళముందు కదులుతున్నాయంటారు రీమా. "పొద్దుటి నుంచి సాయంత్రం వరకూ ఎండలో కష్టపడి పని చేసిన మహిళలు... ఇళ్ళకు వెళ్ళడానికి బదులు ఊరి చివరకు వెళ్ళి, అక్కడ తుప్పల్లో కొన్ని మొక్కల కోసం వెతికేవారు. ఆ మొక్కల కింద ఉన్న చిన్న దుంపలను తీసుకొనేవారు. రాత్రి చీకటిలోనే ఇళ్ళకు వెళ్ళి, ఆ దుంపలను కడిగి, తరిగి, ఉడికించుకొని తినేవారు. రోజంతా అదే వారికి ఆహారం అనే నిజం నన్ను తీవ్ర వేదనకు గురి చేసింది" అని గుర్తు చేసుకుంటారామె. రీమా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పుట్టి పెరిగారు. ఆమె తాతల్లో ఒకరైన మహేంద్రరాయ్ నానావతి సుప్రసిద్ధ న్యాయవాది. మహాత్మాగాంధీ ఏర్పాటు చేసిన 'మహూర్ మహాజన్ సంఘ్' (టెక్స్‌టైల్ లేబర్ అసోసియేషన్-టీఎల్ఏ) తరఫున పని చేశారు. మరో తాత శ్యామ్‌ప్రసాద్ వాసుదేవ అదే సంస్థకు ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. తన కుటుంబానికి గాంధేయవాదం, సేవా నేపథ్యం ఉన్నప్పటికీ... ఇరవై ఏళ్ళు దాటేవరకూ సామాజికమైన అవగాహన తనకు చాలా తక్కువని అంటారు రీమా. "మేము అయిదుగురు అక్కచెల్లెళ్ళం. బయటికి వెళ్తే స్నేహితులు, రెస్టారెంట్లు... జీవితం చాలా హాయిగా గడిచిపోయేది. పట్టణాల్లో పుట్టిన చాలామంది పిల్లల్లా... దేశంలోని పేదరికం గురించి కానీ, గ్రామీణ ప్రజలు మనుగడ కోసం సాగించే పోరాటం గురించి కానీ నాకు ఏమాత్రం తెలీదు" అని చెప్పారామె. మైక్రోబయాలజీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాక... జర్మనీలో ఉద్యోగం చేయాలనేది అప్పట్లో ఆమె ఆలోచన. దానికోసం జర్మన్ నేర్చుకున్నారు. ఈలోగా సివిల్స్ మీద ఆమె దృష్టి పడింది. పట్టుదలగా చదివి... యుపీపీఎస్సీ పరీక్షను క్లియర్ చేశారు. ఐఏఎస్ అకాడమీలో చేరడానికి కాస్త సమయం ఉంది. ఈలోగా రీమా చదివిన కథనం ఆమె కథను మరోవైపు నడిపించింది. అహ్మదాబాద్‌లో వ్యర్థాల సేకరణకు 'సేవ' సంస్థ చేస్తున్న కార్యక్రమాల గురించి ఒక పత్రికలో చదివిన రీమా... తను ఆ సంస్థను సందర్శించి, వారు చేస్తున్న సేవలను స్వయంగా చూడాలనుకుంటున్నానని ఆ సంస్థ నిర్వాహకులకు ఒక లేఖ



రాశారు. "ఐఏఎస్ ట్రైనింగ్‌కు వెళ్ళడానికి కొన్ని రోజుల ముందు... 'సేవ' నుంచి పిలుపు వచ్చింది. వారి ప్రధాన కేంద్రానికి రావచ్చునని, ఆసక్తి ఉంటే... వారి గ్రామీణ విభాగంలో పని చేయవచ్చని సూచించారు. జీతాన్ని కూడా ఆఫర్ చేశారు. దాని గురించి చాలా ఆలోచించాను. ఆ సమయంలో గుజరాత్‌లో కరువు చాలా తీవ్రంగా ఉంది. 'సేవ' నిర్వహించే సహాయక చర్యల్లో నేను పాల్గొనాల్సి ఉంటుంది. జీతం అంత ఎక్కువ కాదు. పని కూడా కష్టమే. కానీ ఐఏఎస్ కావడం కన్నా... అందులోనే నాకు సార్థకత కనిపించింది. 'ఒక ఏడాది చేసి చూద్దాం' అనుకున్నాను. వారి ఆఫర్‌ను అంగీకరిస్తూ ఉత్తరం రాశాను" అని చెప్పారు రీమా. గుజరాత్‌లో బాగా వెనుకబడిన ప్రాంతమైన బనస్కాంతాలోని రాధాపూర్‌లో... సేవా కార్యకర్తగా కొత్త ప్రయాణాన్ని 1984లో ఆమె ప్రారంభించారు. "అక్కడ నీటి, విద్యుత్ సరఫరాలు అస్తవ్యస్థంగా ఉండేవి. తిండి కూడా సరిగ్గా దొరికేది కాదు. నీటి కాలుష్యం వల్ల చర్మం మీద దద్దుర్లు, తరచుగా ఇన్ఫెక్షన్లు వచ్చేవి. ఎండ తీవ్రతను తట్టుకోలేకపోయేదాన్ని. వారంలో ఆరు రోజులు అక్కడ పని చేసి... వారాంతాల్లో అహ్మదాబాద్ వెళ్ళేదాన్ని. అక్కడ నా స్నేహితుల సౌకర్యవంతమైన జీవనం చూసి... 'నేను దీన్ని ఎందుకు ఎంచుకున్నాను?' అనిపించేది" అంటారు రీమా. మరోవైపు గ్రామస్తులతో ఆమె మమేకమయ్యారు. క్రమంగా వీకెండ్స్‌లో, పండుగల్లో వారితో గడపడం ఆరంభించారు. పూట గడవక కటకటలాడే వారి కష్టాలు చూసి చలించిపోయారు. ఏడాది పూర్తయ్యాక కూడా... 'సేవ'లోనే కొనసాగాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఐఏఎస్ ఆలోచనను పూర్తిగా పక్కన పెట్టారు. 'సేవ' వ్యవస్థాపకురాలు, 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత ఇలా భట్ నేతృత్వంలో... గ్రామీణ ప్రాంతాల్లో నీటి వసతిని పెంచడం కోసం సమగ్ర నీటి సరఫరా ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. మహిళల ఉపాధి కోసం పలు పథకాలను అమలు చేశారు. మహిళా సంఘాలను ఏర్పాటు చేసి... నిర్ణయాధికారం వారికే ఉండేలా చర్యలు చేపట్టారు. తన నిబద్ధతతో, కార్యదీక్షతో... 'సేవ'లో అంచలంచెలుగా ఎదిగారు. 1999లో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గుజరాత్ ప్రభుత్వం, అంతర్జాతీయ వ్యవసాయ అభివృద్ధి నిధి (ఐఎ?ఫఎడి)లతో కలిసి 2001లో గుజరాత్ భూకంప బాధితుల కోసం, వారి కుటుంబాల కోసం రీమా చేపట్టిన 'జీవిక' ప్రాజెక్ట్ కొన్ని లక్షల మందికి కొత్త జీవితాన్ని అందించింది. అలాగే 2002లో గుజరాత్ అల్లర్ల బాధితుల కోసం ఆమె రూపొందించిన 'శాంత' ప్రాజెక్ట్ కూడా మన్ననలు అందుకుంది. అలా ఆమె సారథ్యంలో ఎన్నో ప్రాజెక్టులు విజయవంతంగా అమలయ్యాయి. రీమా సేవలకు గుర్తింపుగా 2013లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ అవార్డు'తో ఆమెను సత్కరించింది. ప్రస్తుతం 'సేవ'కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న రీమా నేతృత్వంలో ఆ సంస్థ మన దేశంలో తెలంగాణ సహా 20 రాష్ట్రాల్లో పని చేస్తోంది. దాదాపు అయిదువేల స్వయం సహాయక సంఘాలు, 160కి పైగా సహకార సంఘాలు, దాదాపు 20 ఆర్థిక సమాఖ్యలతో ఇది విస్తరించింది. సుమారు 38 లక్షల మంది అసంఘటిత రంగ మహిళా కార్మికులు దీనిలో సభ్యులుగా ఉన్నారు. చేతివృత్తులు, గృహోపకరణాలు, దుస్తులు... ఇలా ఎన్నో ఉత్పత్తుల తయారీలో మహిళలకు శిక్షణ, ఉపాధి, స్థిరమైన ఆదాయం కల్పించడానికి ఎన్నో పథకాలను సేవా ద్వారా ఆమె అమలు చేస్తున్నారు. "కార్మికులుగా, మహిళలుగా వారి అవసరాలను నెరవేర్చడం, వారి సాధికారతకు దోహదపడడం మా లక్ష్యం" అని చెబుతున్న రీమా... ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, భూటాన్ దేశాల్లో భూకంప బాధితులైన మహిళల పునరావాసం ఉపాధి కోసం కృషి చేశారు. ప్రపంచ బ్యాంక్ సహా అనేక అంతర్జాతీయ సంస్థల సలహా మండళ్ళలో సభ్యురాలుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవలే 'హిల్లరీ రోధమ్ క్లింటన్' పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. "నేను యాదృచ్ఛికంగా ప్రవేశించిన 'సేవ' సంస్థే ఇప్పుడు నాకు సర్వస్వం. 'సేవ' వ్యవస్థాపకురాలు ఇలా భట్ నన్ను ఎంతో ప్రోత్సహించారు. అదే ప్రోత్సాహాన్ని ఆమె కుమారుడు, నా భర్త మిహిర్ భట్ అందిస్తున్నారు. మాకు ఇద్దరు అబ్బాయిలు. వారు కూడా సేవలో భాగస్వాములయ్యారు. ఇన్నేళ్ళుగా నన్ను నడిపిస్తున్నది గ్రామీణ మహిళలే. నాలోని సృజనాత్మకత, ధైర్యం, శక్తి... అంతా వారి చలువే" అంటారు 62 ఏళ్ళ రీమా.

# కుగ్రామం నుంచి అంతర్జాతీయ క్రికెట్ వరకు.. 30 ఏళ్ల స్మృతి ప్రయాణం

భారత మహిళల క్రికెట్ ఇప్పటివరకు అందించిన అత్యుత్తమ క్రీడాకారిణుల్లో ఒకరు స్మృతి మంధాన. ఇది క్రికెట్ పండితుల మాట. టెస్టులు, వన్డేలు, టీ20లు... ఫార్మాట్ ఏదైనా అందులో ఇట్టే ఒదిగిపోయి... జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని ఇవ్వడం అలవాటుగా మార్చుకుంది ఈ లెఫ్ట్‌హ్యాండ్ బ్యాట్స్‌వుమన్. తొమ్మిదేళ్లకే మహారాష్ట్ర అండర్-15 జట్టుకు ఎంపికై, పదకొండేళ్లకు అండర్-19 జట్టులో చోటు సంపాదించుకున్న స్మృతి పుట్టింది ముంబయిలో. ఆమె తండ్రి శ్రీనివాస్ మంధాన, సోదరుడు శ్రావణ్ కూడా జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెటర్లే. తల్లి స్మిత గృహిణి. శ్రీనివాస్ ఒకప్పుడు కెమికల్ డిస్ట్రిబ్యూటర్. స్మృతికి రెండేళ్లప్పుడు ఆమె కుటుంబం ముంబయి నుంచి మహారాష్ట్ర మాధవ్‌నగర్ శివార్లలోని సంగ్లీకి మారింది. చిన్నప్పటి నుంచీ అన్నయ్య మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించిన ఆమె... ఆటపై మక్కువ పెంచుకుంది. తరువాత అతనితో కలిసి సాధన చేసింది. పేపర్లలో వచ్చిన అతని మ్యాచ్ క్లిప్పింగ్స్‌ను కట్ చేసి భద్రపరుచుకునేది. 'ఒక రోజు నేను కూడా ఇలానే పరుగులు సాధిస్తాను. అన్నయ్యతో కలిసి నెట్స్‌కు వెళతానని చెప్పినప్పుడు మా నాన్న ఎప్పుడూ వద్దనలేదు' అంటూ ఓ సందర్భంగా గుర్తుచేసుకున్న స్మృతి వాస్తవానికి కుడిచేతి వాటం క్రీడాకారిణే. కానీ ఆమె తండ్రి తన బిడ్డను ఎడమచేతి వాటం బ్యాట్స్‌వుమన్‌గా తీర్చిదిద్దాలనుకున్నారు. అలా ఆయన నేతృత్వంలో ఆమె లెఫ్ట్‌హ్యాండర్‌గా సాధన చేస్తూ వచ్చింది. సంగ్లీ చింతామణ్‌రావ్ కాలేజీలో కామర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఈ స్టార్ ఓపెనర్ 2013లో లిస్ట్-ఎ అండర్-19 మ్యాచ్‌లో డబుల్ సెంచరీ చేసి, ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. అది మొదలు స్మృతి రికార్డులు తిరగరాస్తూ... భారత జట్టు తలుపు తట్టింది. అదే ఏడాది భారత టీ20, వన్డే జట్టుకు ఎంపికైంది. బంగ్లాదేశ్‌తో టీ20 ద్వారా తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడే సమయానికి ఆమె వయసు 16 సంవత్సరాలు. "నేను మొదటిసారి భారత జట్టుతో కలిసినప్పుడు అక్కడి ఆటగాళ్లను, సహాయక సిబ్బందిని, కోచ్‌లను చూడటం ఒక గొప్ప అనుభూతినిచ్చింది. డ్రెస్సింగ్‌రూమ్‌లోకి అడుగుపెట్టినప్పుడు భయమేసింది. అప్పుడు ఝులన్ గోస్వామి నా దగ్గరకు వచ్చి... "ప్రతిఒక్కరికీ ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది. ఇది చాలా సాధారణం' అని చెప్పింది. అప్పుడు తను నా రూమ్‌మేట్. ఎన్నో విషయాల్లో అండగా నిలిచింది. ఇప్పుడు నేను కూడా జట్టులోకి ఎవరైనా కొత్త క్రీడాకారిణి వచ్చినప్పుడు, వారితో మాట్లాడి, భయం పోగొట్టి, సౌకర్యంగా ఉండేలా చూసుకొంటున్నాను" అంటుంది ఈ స్టార్ ఓపెనర్.



కెరీర్ ఆరంభంలో కొన్ని మ్యాచ్‌ల్లో స్మృతి ఓవర్‌సైజ్‌డ్ బ్యాట్‌తో బరిలోకి దిగింది. ఆ బ్యాట్‌కు ఒక ప్రత్యేకత ఉంది. క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ సంతకం చేసి ఇచ్చిన బ్యాట్ అది. "అన్నయ్య రాహుల్ సర్‌ను కలిసి ఒక బ్యాట్ ఇవ్వగలరా అని అడిగాడు. ఆయన నా పేరుతో సంతకం చేసి ఇచ్చారు. నా కోసం అన్నయ్య ఆ బ్యాట్ తీసుకున్నాడు. దాన్ని ఒక మెమరీగా దాచుకొందామని అనుకున్నాను. కానీ చేతిలోకి తీసుకోగానే బ్యాలెన్స్ అద్భుతంగా అనిపించింది. దాంతో ఆడటం మొదలుపెట్టాను" అంటూ చెప్పుకొచ్చిన స్మృతి ఆ బ్యాట్‌తోనే గుజరాత్‌తో జరిగిన అండర్-19 మ్యాచ్‌లో 150 బంతుల్లో 224 పరుగుల రికార్డు స్కోరు చేసింది. 2014లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలి టెస్ట్ ఆడింది. తొలి ఇన్నింగ్స్‌లో 22, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులు చేసి జట్టు చారిత్రక విజయంలో కీలక పాత్ర పోషించింది. నాటి నుంచి భారత జట్టులో స్మృతి విలువైన సభ్యురాలిగా మారింది. మాజీ కెప్టెన్, ఆరాధ్య క్రికెటర్ మిథాలీ రాజ్, హర్మన్‌ప్రీత్ కౌర్‌లతో పాటు భారత బ్యాటింగ్‌కు మూల స్తంభం అయింది. అన్ని ఫార్మాట్లలో కలిపి అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో పది వేలకు పైగా పరుగులు సాధించింది. వీటిల్లో 18 సెంచరీలున్నాయి. మూడు అంతర్జాతీయ ఫార్మాట్లలోనూ సెంచరీలు చేసిన తొలి భారత మహిళ కూడా. ఎన్నో ఏళ్ల నుంచి స్మృతి భారత మహిళా జట్టు కెప్టెన్ రేసులో పోటీపడుతోంది. జట్టుకు అద్భుతమైన ఆరంభాన్నిస్తూ, ఆపద సమయాల్లో ఆదుకొంటూ తనదైన ముద్ర వేసింది. వాస్తవానికి సారథ్య బాధ్యతలు ఆమెకు అప్పగించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కానీ బీసీసీఐ హర్మన్‌ప్రీత్‌ను కొనసాగిస్తూ వచ్చింది. ఆసియా కప్‌కు ముందు 'మీరు కెప్టెన్సీ చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారా?' అని అడిగిన ప్రశ్నకు 'సిద్ధమే'నని సమాధానం ఇచ్చింది స్మృతి. గత సంవత్సరం స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచ కప్ గెలిచిన తరువాత కెప్టెన్సీ మార్పు ఉంటుందని అందరూ భావించారు. కానీ నిరాశే ఎదురైంది. ఎట్టకేలకు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచిన అనంతరం సారథ్య బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్టు హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రకటించింది. దాంతో స్మృతికి పగ్గాలు అప్పగిస్తున్నట్టు సెలక్షన్ కమిటీ వెల్లడించింది. ఎన్నాళ్లో వేచిన ఉదయం ఇన్నేళ్లకు ప్రసరించింది. జట్టులో అందరికంటే మెరుగ్గా రాణిస్తున్నా, ప్రతిభకు కొదవ లేకపోయినా స్మృతికి సుదీర్ఘ కాలం నిరీక్షణ తప్పలేదు. ఇదే ఆమెను అసహనానికి గురి చేసింది. వ్యక్తిగతంగా కూడా స్మృతి ఊహించని సమస్యలు ఎదుర్కొంది. ప్రేమించిన వ్యక్తితో జీవితాన్ని పంచుకోవాలని తపించినా... చివరకు ఆ బంధం అర్ధంతరంగా ముగిసింది. కానీ ఆ ప్రభావం ఆటపై పడకుండా ఎంతో పరిణతితో వ్యవహరించింది స్మృతి. నేడు భారత జట్టు సారథిగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న ఆమె మరిన్ని చిరస్మరణీయ విజయాలను అందించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. దశాబ్దానికి పైగా భారత మహిళల క్రికెట్‌లో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన స్మృతి ఎన్నో పురస్కారాలు అందుకుంది. నాలుగుసార్లు ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైంది. "నాకు తొమ్మిదేళ్లప్పుడు నాకంటే నాలుగైదు ఏళ్లు పెద్దవాళ్లయిన అబ్బాయిలతో కలిసి క్రికెట్ ఆడేదాన్ని. వాళ్ల బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొనగలిగాను. అది చూసి మా నాన్న నన్ను సెలక్షన్ ట్రయల్స్‌కు తీసుకువెళ్లాలని అనుకున్నారు. మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించడం మొదలుపెట్టాక... మిథాలీరాజ్, ఝులన్ గోస్వామి గురించి విన్నాను. నేను కూడా ఈ గొప్ప క్రీడాకారులతో కలిసి భారత జట్టుకు ఆడగలనని అనిపించేది" అంటూ నాటి రోజులు గుర్తు చేసుకున్న స్మృతి... పట్టుదల, అంకితభావంతో అనుకున్నది సాధించింది.

# త్రివిక్రమ్ దెబ్బకు వెనక్కి తగ్గిన చిన్న సినిమాలు!





తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఓ పెద్ద సినిమా విడుదల ఖరారైతే అది అనేక చిన్న సినిమాల విడుదల ప్రణాళికలపై ప్రభావం చూపిస్తుంది. దానికి తాజా ఉదహరణే ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రం. ఈ భారీ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో 'ఇట్లు అర్జున', 'సమ్మర్ హాలిడేస్'అనే రెండు చిన్న చిత్రాలు తమ విడుదల తేదీని నవంబర్ 6కి వాయిదా వేసుకున్నాయి.

ఇంట్రెస్టింగ్ విషయమేమిటంటే.. ఈ రెండు చిన్న సినిమాలు మొదట అక్టోబర్ 9న రిలీజ్ అవుతాయని ప్రకటించారు. అయితే 'ఆదర్శ కుటుంబం' కూడా పోటీలోకి రావడంతో వారు అక్టోబర్ 30కి మారాలని భావించారు. కానీ ఇప్పుడు 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేయడానికి అధికారికంగా నిర్ణయించడంతో ఈ రెండు సినిమాలు మళ్లీ పోటీ నుంచి తప్పుకుని నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. మరోవైపు అక్టోబర్ 30న 'ఆదర్శ కుటుంబం' సినిమా విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న 'కల్ట్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద నేరుగా పోటీ పడనుంది. దీంతో ఈ రెండు సినిమాల మధ్య ఆసక్తికరమైన పోరు నెలకొననుంది. చిన్న చిత్రాల నిర్మాతలకు విడుదల తేదీని ఎంచుకోవడం అనేది కేవలం ఒక రోజును ఖరారు చేసుకోవడం మాత్రమే కాదు. మార్కెట్లో పోటీ, థియేటర్ల లభ్యత, తగినన్ని స్క్రీన్లు దక్కుతాయా లేదా అనే కోణంలో ఆలోచించాల్సి ఉంటుంది. అంతే కాకుండా విడుదల తేదీని పదే పదే మార్చడం వల్ల పబ్లిసిటీ ప్రణాళికలపై, బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. తాజాగా జరిగిన ఈ మార్పులు చిన్న సినిమాలకు అనువైన విడుదల సమయాన్ని వెతుక్కోవడంలో ఎదురయ్యే సవాళ్లను మరోసారి స్పష్టం చేస్తున్నాయి. అక్టోబర్ 30న 'ఆదర్శ కుటుంబం' , 'కల్ట్' సినిమాలు బాక్సాఫీస్ సమరానికి సిద్ధమవుతుండగా.. నవంబర్ 6న విడుదలయ్యే 'ఇట్లు అర్జున', 'సమ్మర్ హాలిడేస్' సినిమాలు ఏ మేరకు రాణిస్తాయో వేచి చూడాల్సిందే.

హాట్ స్టార్!



## ఆడిషన్స్‌కి పిలిచి అనుపమను అవమానించారా?



హిట్, ఫ్లాప్స్‌తో సంబంధం లేకుండా సినిమాలు చేస్తూ వస్తున్నారు అనుపమ పరమేశ్వరన్. ఇటీవల వ్యక్తిగత జీవితంలో ఎదురైన కష్టాన్ని ఎదుర్కొని తిరిగి సినిమాలలో బిజీ అవుతున్నారు అనుపమ. తాజాగా క్రేజీ కళ్యాణం మూవీతో తెలుగువారిని పలకరించారు. ఈ సినిమా ప్రమోషనల్ కార్యక్రమాల్లో భాగంగా ఓ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనుపమ పరమేశ్వరన్ ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. మనసులో ఉన్నది ఉన్నట్లు మాట్లాడటంలో అనుపమ ముందుంటారు. ఈ విషయంలో ఎన్ని విమర్శలు వచ్చినా ఆమె వెనక్కి తగ్గరు. గతంలో వ్యక్తిగత వేధింపుల కార ణంగా తాను ఎంతో కుంగిపోయా.. ఒక దశలో నట జీవితాన్నే వదిలిపెట్టాలని అనుకున్నాను. ప్రతిరోజు భారంగా జీవితాన్ని గడిపాను. రోజూ పోరాడాల్సి వస్తోంది.. రాత్రి పడుకునే ముందు ఈరోజుకు బతికిపోయాను స్వామి అనిపించేది. జీవితం ఓ సవాలుగా మారిపోయింది. నా అనుభవాలు కొందరిలో అయినా ధైర్యం తీసుకొస్తాయనే ఈ విషయాలు పంచుకుంటున్నానని అనుపమ తెలిపారు. ఇక సోషల్ మీడియాలో వచ్చే నెగటివ్ కామెంట్స్‌పైనా అనుపమ పలుమార్లు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎంతో ఇష్టపడి చేసిన పరదా సినిమా గురించి కొందరు నెగటివ్ కామెంట్స్ చేశారు.. ఈ ట్రోలింగ్ మా సినిమా భవిష్యత్తును నిర్ణ యించలేవు. ఆ సినిమా ప్రేక్షకుల అభిమానాన్ని దక్కించు కోలేకపోయినా... నా నట ప్రస్థానంలో ఒక మంచి సినిమా చేశాననే తృప్తి జీవితాంతం మిగులుతుంది. తొలినాళ్లలో ఇలాంటి ట్రోలింగ్‌కు బాధపడేదానిని.. కానీ ఇప్పుడు అలాంటి వాటిని వదిలేశా. ఎవరెన్ని మాటలన్నా ముందుకు సాగాల్సిందేనని అనుపమ స్పష్టం చేశారు. ఇక తన జీవితంలో ఓసారి ఓ సినిమా కోసం ఆడిషన్స్‌కి వెళ్లినప్పుడు నన్ను రిజెక్ట్ చేశారని అనుపమ గుర్తుచేసుకున్నారు. నా జీవితంలో ఫస్ట్ ఆడిషన్స్ అంటే ప్రేమమ్ కోసమే. అక్కడికి వెళ్లాక వాళ్లు నన్ను చూశారు.. ఆ టైంలో నా హెయిర్ స్టైల్ ఎలా పడితే అలా ఉండేది. హెయిర్ కట్ చేసుకుంటావా అని ఆడిషన్స్‌లో అడిగారు.. క్యారెక్టర్‌కి లుక్ బాగుందని నిర్ణయించుకున్నాక సీన్ పేపర్ ఇచ్చారు. అందులో ఓ బ్రేకప్ సీన్ లాంటిది ఉంది.. నాకు థియేటర్‌లో చేసిన ఎక్స్‌పీరియన్స్ మాత్రమే ఉంది. డైరెక్టర్ యాక్షన్ అని చెప్పగానే ఒక స్టెప్ ముందుకు వేసి సీన్ చేశాను. 10 సార్లు కట్ చెప్పినా అలాగే చేశా. దాంతో వాళ్లు నాకు దండం పెట్టేసి వెళ్లిపోమన్నారు అని అనుపమ తెలిపారు. ఈ బాధతో ఇంటికి వెళ్లకుండా కాలేజీ హాస్టల్‌కి వెళ్లాను. నా జీవితంలో నాకు పెద్దగా రిజెక్ట్ అయిన సందర్భాలు లేవు.. అదే పెద్దది. 2 వారాల పాటు ఈ విషయం ఎవరికీ చెప్పకుండా నాలోనే అనుభవించా... ఫ్రెండ్స్‌కి చెబితే ఎగతాళి చేస్తారని భయం. ఆ టైంలో డైలాగ్స్‌ని పదే పదే రిహార్సల్ చేశా. అదృష్టవశాత్తూ రెండు వారాల తర్వాత వాళ్లు నాకు మళ్లీ కాల్ చేయడంతో ఆనందం పట్టలేకపోయా. కానీ మా అమ్మ మాత్రం నా కూతురిని అవమానిస్తారా? నా కూతురిని రిజెక్ట్ చేస్తారా? నేను పంపను అని మొండి పట్టు పట్టింది. దాంతో మా అమ్మని బతిమలాడి ప్రేమమ్ సెట్‌లో అడుగుపెట్టా. ఈసారి యాక్షన్ చెప్పినప్పుడు స్టెప్ వేయకుండా సీన్ కంప్లీట్ చేశాను అని అనుపమ పరమేశ్వరన్ గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





## జైలర్-2పై అల్లు అర్జున్ షాకింగ్ ట్వీట్

సూపర్ స్టార్ రజనీకాంత్- కోలీవుడ్ సెన్సేషనల్ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కాంబోలో వచ్చిన జైలర్ 2 మూవీ ప్రస్తుతం బాక్సాఫీస్ ర్యాంపేజ్ సృష్టిస్తోంది. దసరా కానుకగా అక్టోబర్ 15న విడుదలైన ఈ మూవీ బ్లాక్ బస్టర్ టాక్ తో దూసుకెళ్తోంది. ఈ చిత్రం కేవలం 6 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 500 కోట్లకు పైగా కలెక్షన్లను అందుకుని రికార్డ్ క్రియేట్ చేసింది. అయితే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తాజాగా జైలర్ 2 మూవీపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ మూవీని చూసిన ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ ను ఆకాశానికి ఎత్తారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. జైలర్ 2 మూవీలో రజనీకాంత్ స్టార్ పవర్, స్వాగ్, ఆరా గురించి ఎంత చెప్పినా తక్కువేనని పేర్కొన్నారు. ఎడ్రినలిన్ పంపింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ ఇదేనని పోస్టు చేశారు.

అలాగే బ్రదర్ అనిరుధ్.. యూ కిల్డ్ ఇట్..!! ఆర్టిస్టులు.. టెక్నీషియన్లు, నిర్మాత.. ఇలా అందరూ తమ ప్రాణం పెట్టి సినిమాకు పనిచేశారు. ది షో మాన్ నెల్సన్ దిలీప్ కుమార్ కూలెస్ట్ హిట్ ను బ్యాంగ్ తో డెలివర్ చేశారు. "చొక్కా నలగకుండా 500 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టడం ఒక్క రజనీ గారికే సాధ్యం.. జైలర్ 2 చిత్ర యూనిట్ కు శుభాకాంక్షలు" అని చివరగా సన్ పిక్చర్స్ ను ట్యాగ్ చేశారు..

అయితే అల్లు అర్జున్ ట్వీట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఇక అల్లు అర్జున్ ట్వీట్ కు మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రిప్లై ఇచ్చారు. మై బ్రదర్ అంటూ లవ్ సింబల్ ఈమోజీలతో తన ట్వీట్ పెట్టారు. ఇక 2023 లో రజనీకాంత్- నెల్సన్ దిలీప్ కుమార్ కాంబోలో వచ్చిన జైలర్ మూవీకి సీక్వెల్ గా ఈ మూవీ తెరకెక్కింది. జైలర్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయింది. బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ. 500 కోట్లకుపైగా కలెక్షన్స్ ను రాబట్టింది. అయితే ఈ మూవీకి కొనసాగింపుగా ఇటీవల జైలర్ 2 విడుదలైంది. ఈ మూవీలో సూపర్ స్టార్ రజనీకాంత్ తో పాటు కన్నడ స్టార్ హీరో శివకుమార్, సూరజ్ వెంజారమూడు, మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్, బాలీవుడ్ నటి విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, ఎస్.జే. సూర్య తదితరులు నటించారు.

## నవంబర్ 5న 'రామాయణ'

ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'రామాయణ' ఒకటి. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా.. సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్నారు. అలాగే రాకింగ్ స్టార్ యష్ రావణాసురుడి పాత్రలో నటిస్తున్నారు. ఇక బాలీవుడ్ స్టార్ యాక్టర్ సన్నీ డియోల్ హనుమంతుడి పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి దంగల్ మూవీ ఫేమ్ నితీష్ తివారీ దర్శకత్వం వహించారు. ఈ మూవీ నుంచి పార్ట్ 1 దీపావళి సందర్భంగా నవంబర్ 5 న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్లు సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. దాంతో ఈ మూవీని ఎప్పుడెప్పుడు చూస్తామా..? అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు రామాయణ సినిమాపై ఉన్న బజ్ కారణంగా రిలీజ్ కు దాదాపు 15 రోజుల ముందుగానే ప్రీ బుకింగ్స్ మొదలయ్యాయి. ఇక రామాయణ మూవీలో హాలీవుడ్ రేంజ్ వీఎఫ్ ఎక్స్ ను వాడారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మ్యూజిక్ కంపోజర్స్ హన్స్ జిమ్మర్, ఏ ఆర్ రహమాన్ సంయుక్తంగా స్వరాలను సమకూర్చారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రైమ్ స్టూడియోస్, మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై నమిత్ మల్హోత్రా, యష్ కలిసి నిర్మించారు. ఈ మూవీ సెన్సార్ ఇటీవల పూర్తయింది. పార్ట్ 1 మూవీ రన్ టైమ్ ఏకంగా 3 గంటల 15 నిమిషాలుగా ఉన్నట్లు తేలింది. ఇక రామాయణ రెండు పార్ట్స్ కు కలిపి రూ. 4000 వేల కోట్ల భారీ బడ్జెట్ తో ఈ మూవీ తెరకెక్కింది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రివ్యూ షో ను ముంబై లోని ఒక థియేటర్ లో ప్రత్యేకంగా కొంతమంది బయర్స్ కు వేసి చూపించారట. అందుకు సంబంధించిన టాక్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. రామాయణ మూవీలో అందరికన్నా రాకింగ్ స్టార్ యష్ రావణుడి పాత్రలో తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించినట్లు స్పష్టం అవుతోంది. కేజీఎఫ్ సిరీస్, టాక్సిక్ చిత్రాలతో నెగటివ్ క్యారెక్టర్స్ లో పండిపోయిన యష్.. ఈ మూవీలో రావణాసురుడి పాత్రకు ప్రాణం పోసినట్లు తెలుస్తోంది.





## జూనియర్ ఎన్టీఆర్‌పై సోషల్ మీడియాలో దాడి



సోషల్ మీడియా వార్తలకు మాత్రమే కాకుండా ట్రోలింగ్, వివాదాస్పద కంటెంట్‌కు వేదికగా మారుతున్నాయి. చాలా కాలంగా పలువురు సినీ కథానాయకులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు సోషల్ మీడియా వేదికల్లో నిరంతరం ట్రోలింగ్‌ను ఎదుర్కొంటున్నారు. అయితే ఇటీవల ప్రముఖ టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్ విషయంలో జరుగుతున్న దాడి.. ఆయనే లక్ష్యంగా, పక్కా ప్రణాళికతో జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎన్టీఆర్‌కు సంబంధించిన అసభ్యకరమైన, వికృతమైన స్టిక్కర్లు, మార్ఫింగ్ ఫోటోలు విస్తృతంగా హల్చల్ చేస్తున్నాయి. ముఖ్యంగా వాట్సాప్, ఇతర మెసేజింగ్ యాప్‌లలో ఇటువంటి స్టిక్కర్లు వేగంగా వైరల్ అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పరిధి దాటి, ఉత్తరాది రాష్ట్రాలు, తమిళనాడులో కూడా ఈ మార్ఫింగ్ ఫోటోలను కొందరు హాస్యాస్పదమైన పోస్టులుగా ఉపయోగిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎన్టీఆర్‌ను విచిత్రమైన, అసభ్యకరమైన రీతిలో చూపిస్తున్న వేలాది పోస్టులు ట్రెండ్ అవుతున్నాయి. ఇది సాధారణ సరదా హద్దులు దాటి వ్యక్తిత్వ హననం స్థాయికి చేరుకుంది. నెటిజన్లు ఇలాంటి ట్రోల్స్‌కు అలవాటు పడితే అది ఆయన ఇమేజ్‌కు తీవ్ర నష్టం కలిగిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామంపై ఎన్టీఆర్ తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. గతంలో 'చుట్టమల్లే' సాంగ్ ఆధారంగా తయారుచేసిన ఏఐ అసభ్యకర కంటెంట్‌ను వ్యాప్తి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించినప్పటికీ.. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదు. ఇప్పుడు దానికి తోడు వాట్సాప్ స్టిక్కర్లు, జిఫ్ లు సోషల్ మీడియా అంతటా వైరల్ అవుతున్నాయి. ఇటీవలే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో తన పేరు, ఫోటోలు, గుర్తింపును అపహాస్యం చేయకుండా నిరోధించడానికి ఎన్టీఆర్ ఢిల్లీ హైకోర్టు నుంచి పర్సనాలిటీ రైట్స్ ఆజ్ఞలను పొందిన సంగతి తెలిసిందే. ఈ చట్టపరమైన ఉత్తర్వులను వినియోగించుకుని ఇలాంటి అసభ్యకర ట్రోలింగ్‌కు చెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది.